పత్రికతో.. మార్పులు
APTEL/25/A1880
# TN తెలుగు న్యూస్
దిన పత్రిక
మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..
సంపుటి : 1 సంచిక : 710 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ సోమవారం 07.09.2026 పేజీలు : 8 వెల : 4/-

## 'ఇంటింటికీ టీడీపీ'
# 42 రోజుల్లో 1.04 కోట్ల ఇళ్లకు..
### కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజలకు వివరణ

- అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరణ
- కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని వెల్లడి




తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "ఇంటింటికీ తెలుగుదేశం - 2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగుతోంది. 42వ రోజుకు చేరుకున్న ఈ కార్యక్రమం ద్వారా టీడీపీ శ్రేణులు ఇప్పటివరకు 1.04 కోట్ల కుటుంబాలను నేరుగా కలిశాయి. కేవలం ఆదివారం ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 1,54,454 ఇళ్లను సందర్శించి, ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా, ఈ కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో టీడీపీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన ప్రయోజనాలను వివరిస్తున్నారు. ముఖ్యంగా రైతులు, మహిళలు, యువత, పేద వర్గాలకు అందుతున్న సంక్షేమ ఫలాలను తెలియజేస్తున్నారు. ప్రభుత్వ పథకాలను వివరించడంతో పాటు, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, వారి అభిప్రాయాలను కూడా టీడీపీ నేతలు ఓపిగ్గా అడిగి తెలుసుకుంటున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పనితీరుపై ప్రత్యక్షంగా ప్రజా స్పందనను సేకరిస్తున్నారు. ప్రజల నుంచి వస్తున్న సూచనలు, సలహాలను స్వీకరించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని, టీడీపీ శ్రేణులతో పాటు సాధారణ ప్రజలు కూడా భాగస్వాములవుతున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం మరింత విస్తృతంగా, విజయవంతంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నాయి.



## రాజమండ్రిలో కుండపోత..
# రోడ్లన్నీ జలమయం

- రాజమండ్రిలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం
- ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కురిసిన వాన
- లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులు జలమయం
- డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు
- వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలు

రాజమండ్రిలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన

తరువాయి 2లో

# తప్పిన విమాన ప్రమాదం
## బెంగళూరులో సురక్షిత ల్యాండింగ్


2లో

- బెంగళూరు నుంచి లండన్ వెళ్లాల్సిన విమానంలో సాంకేతిక లోపం
- టేకాఫ్ అయిన కొద్దిసేపటికే సమస్యను గుర్తించిన పైలట్లు
- తుమకూరు సమీపంలో అరగంట పాటు గాల్లో చక్కర్లు కొట్టిన విమానం
- సుమారు 270 మంది ప్రయాణికులతో సురక్షితంగా వెనక్కి ల్యాండింగ్
- విమానాన్ని రద్దు చేసిన వర్జిన్ అట్లాంటిక్.. ప్రయాణికులకు క్షమాపణ



## భవనం కూలి ముగ్గురి మృతి
### ఢిల్లీలో విషాదం

- ఢిల్లీలోని సత్య నికేతన్‌లో ఘోర ప్రమాదం
- ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించగా, పలువురిని కాపాడిన సహాయక బృందాలు
- మరమ్మతు పనులు చేస్తుండగా పాత భవనం కూలిపోయినట్లు వెల్లడి
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై విపక్షాల ఆగ్రహం, ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్
- శిథిలాల కింద పలువురు విద్యార్థులు చిక్కుకున్నట్లు అనుమానాలు

2లో

## హైదరాబాద్ మెట్రోకు కొత్త కోచ్‌లు
### తెరపైకి వచ్చిన సాంకేతిక సమస్య



- హైదరాబాద్ మెట్రోలో కొత్త కోచ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వ సన్నాహాలు
- పాత సిగ్నలింగ్ వ్యవస్థతో అనుసంధానంపై సాంకేతిక సవాలు
- మొత్తం వ్యవస్థను ఆధునికీకరించాలని సూచించిన డీఎంఆర్‌సీ
- భవిష్యత్ అవసరాల కోసమే ఈ సిఫార్సు అని నిపుణుల అభిప్రాయం

2లో

## 'దిమాగీ నక్సల్' పిల్ ఇచ్చా..
### వాళ్లంతా బయటకొచ్చారు



- 'దిమాగీ నక్సల్' అనే హోమియోపతి మాత్రతో విమర్శకుల అసలు రంగు బయటపడిందన్న మోదీ
- గత ప్రభుత్వాల హయాంలోని వైఫల్యాలను విద్యార్థులకు వివరించిన ప్రధాని

2లో

# ప్రైవేటీకరణ అంటూ కథనాలు..
## క్లారిటీ ఇచ్చిన ఇస్రో

- ప్రైవేటీకరణ వార్తలను ఖండించిన భారత అంతరిక్ష సంస్థ
- మా పాత్ర తగ్గదు, మరింత కీలకమవుతుందని స్పష్టీకరణ
- అధునాతన పరిశోధనలపై దృష్టి పెడతామన్న ఇస్రో
- ప్రైవేట్ రంగ భాగస్వామ్యం సామర్థ్యాన్ని పెంచడానికేనని వెల్లడి
- 2035 నాటికి భారతీయ అంతరిక్ష్ స్టేషన్ ఏర్పాటు లక్ష్యం




భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రైవేటీకరిస్తున్నారంటూ గత కొద్ది రోజులుగా మీడియాలో వస్తున్న ఊహాగానాలకు సంస్థ ఆదివారం పూర్తిస్థాయిలో తెరదించింది. ఇస్రోను ప్రైవేటీకరించే ఆలోచన లేదని, దేశ అంతరిక్ష ప్రయోగాలలో దాని ప్రాధాన్యం ఎప్పటికీ తగ్గదని స్పష్టం చేసింది. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేసింది. ఇస్రో భవిష్యత్ పాత్రపై కొన్ని మీడియా సంస్థలు అసత్యాలు, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నాయని, ఈ కథనాలు పూర్తిగా నిరాధారమైనవని ఇస్రో పేర్కొంది. "ఇస్రోను ప్రైవేటీకరించరు, దాని ప్రాముఖ్యాన్ని తగ్గించరు

తరువాయి 2లో



## అనక్ క్రాకటోవా విస్ఫోటనం
### నిలిచిన విమానాలు

- జకార్తాను కమ్మేసిన బూడిద మేఘాలు
- 300కు పైగా విమాన సర్వీసులు రద్దు
- వేలాది అడుగుల ఎత్తుకు ఎగిసిపడుతున్న బూడిద, ధూళి
- సునామీ ప్రమాదం లేదని స్పష్టం చేసిన ఇండోనేషియా అధికారులు
- బూడిద కారణంగా పలుచోట్ల పాఠశాలలకు సెలవులు, జనజీవనంపై ప్రభావం

2లో

# తప్పిన విమాన ప్రమాదం.. బెంగళూరులో సురక్షిత ల్యాండింగ్

బెంగళూరు నుంచి లండన్ వెళ్లాల్సిన వర్జిన్ అట్లాంటిక్ విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో టేకాఫ్ అయిన కొద్దిసేపటికే వెనక్కి తిరిగి వచ్చింది. సుమారు 270 మంది ప్రయాణికులతో ఉన్న ఈ విమానం ఆదివారం ఉదయం కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో సురక్షితంగా ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయ్యింది. ప్రయాణికులు, సిబ్బంది అంతా సురక్షితంగా ఉన్నారని అధికారులు ప్రకటించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే, వర్జిన్ అట్లాంటిక్ విమానానికి చెందిన VS317 సర్వీస్, బోయింగ్ 7879 విమానం, ఈరోజు ఉదయం 8:20 గంటలకు కెంపెగౌడ విమానాశ్రయం టెర్మినల్ 2 నుంచి లండన్



హీత్రూకు బయలుదేరింది. అయితే, టేకాఫ్ అయిన కొద్దిసేపటికే విమానంలో సాంకేతిక సమస్యను పైలట్లు గుర్తించారు. దీంతో, లండన్ ప్రయాణాన్ని కొనసాగించకుండా, ముందుజాగ్రత్త చర్యగా విమానాన్ని వెనక్కి మళ్లించాలని నిర్ణయించారు. బెంగళూరు విమానాశ్రయానికి తిరిగి వచ్చే ముందు, విమానాన్ని సుమారు అరగంటకు పైగా తుమకూరు సమీపంలోని గగనతలంలో చక్కర్లు కొట్టించారు. అనంతరం, కెంపెగౌడ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. విమానాశ్రయ నిర్వాహక సంస్థ అయిన బెంగళూర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (BIAL) ప్రయాణికులందరూ క్షేమంగా ఉన్నట్లు ధ్రువీకరించింది. ఈ ఘటనపై వర్జిన్ అట్లాంటిక్ సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది. "సాంకేతిక సమస్య కారణంగా బెంగళూరులండన్ విమానం వెనక్కి తిరిగి వచ్చింది. విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది. ఈ సర్వీస్‌ను రద్దు చేశాం. ప్రయాణికులు, సిబ్బంది భద్రతే మాకు అత్యంత ముఖ్యం. కలిగిన అసౌకర్యానికి ప్రయాణికులకు క్షమాపణలు చెబుతున్నాం. ప్రభావితమైన వారికి మా బృందాలు సహకరిస్తున్నాయి. వీలైనంత త్వరగా ప్రత్యామ్నాయ విమానాల్లో వారికి సీట్లు కేటాయించేందుకు కృషి చేస్తున్నాం," అని ఆ ప్రకటనలో పేర్కొంది. విమానంలో తలెత్తిన సాంకేతిక సమస్యకు కచ్చితమైన కారణమేమిటనేది ఇంకా తెలియరాలేదు. విమానాశ్రయ అధికారులు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. ప్రముఖ వ్యాపారవేత్త సర్ రిచర్డ్ బ్రాన్సన్ స్థాపించిన వర్జిన్ గ్రూప్‌కు ఈ ఎయిర్‌లైన్స్‌లో 51% వాటా ఉండగా, మిగిలిన 49% వాటాను అమెరికాకు చెందిన డెల్టా ఎయిర్ లైన్స్ కలిగి ఉంది.

## రాజమండ్రిలో కుండపోత.. రోడ్లన్నీ జలమయం

(మొదటిపేజీ తరువాయి)
కుండపోత వాన నగర ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. సుమారు గంటపాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి నగరంలోని ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆదివారం సాయంత్రం వేళ ఒక్కసారిగా వాతావరణం మారిపోయి భారీ వర్షం ముంచెత్తింది. పలు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా పనిచేయకపోవడంతో వర్షపు నీరు రోడ్లపైనే భారీగా నిలిచిపోయింది. దీంతో రోడ్లు చెరువులను తలపించాయి. ఫలితంగా వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ముఖ్యంగా దానవాయిపేట, ఆవారోడ్డు, ప్రకాశ్ నగర్ సహా పలు ప్రధాన కూడళ్లలో నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సాయంత్రం పనుల మీద బయటకు వెళ్లినవారు, ఇళ్లకు తిరిగి వెళ్లేవారు అకస్మాత్తుగా కురిసిన వర్షంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతిసారీ చిన్నపాటి వర్షానికే నగరం ఇలా జలదిగ్బంధంలో చిక్కుకోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థ వైఫల్యం కారణంగానే ఈ దుస్థితి తలెత్తుతోందని వారు ఆరోపిస్తున్నారు.

## అనక్ క్రాకటోవా విస్ఫోటనం.. నిలిచిన విమానాలు

ఇండోనేషియాలోని అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం మరోసారి బద్దలైంది. శుక్రవారం రాత్రి నుంచి ఉగ్రరూపం దాల్చిన ఈ అగ్నిపర్వతం నుంచి వెలువడుతున్న బూడిద, ధూళి మేఘాల కారణంగా రాజధాని జకార్తాలో విమాన సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముందుజాగ్రత్త చర్యగా సోకర్నోహట్టా అంతర్జాతీయ విమానాశ్రయంలో 300కు పైగా విమాన సర్వీసులను అధికారులు రద్దు చేశారు. దీంతో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జావా, సుమత్రా దీవుల మధ్య ఉన్న ఈ అగ్నిపర్వతం నుంచి వెలువడిన బూడిద ఆదివారం ఉదయం జకార్తా విమానాశ్రయ పరిసరాలను కమ్మేసింది. దీంతో అధికారులు తొలుత ఉదయం 9:30 గంటల వరకు, ఆ తర్వాత సాయంత్రం 5:30 గంటల వరకు విమాన రాకపోకలను నిలిపివేశారు. మొత్తం 301 విమానాలను రద్దు చేయగా, వాటిలో 58 అంతర్జాతీయ సర్వీసులు ఉన్నాయి. ఈ పరిణామంతో 22,000 మందికి పైగా ప్రయాణికులపై ప్రభావం పడింది. సింగపూర్ ఎయిర్‌లైన్స్, మలేషియా ఎయిర్‌లైన్స్ వంటి సంస్థలు జకార్తాకు తమ సర్వీసులను రద్దు చేసుకున్నాయి. సింగపూర్, దోహా, సిడ్నీ, కౌలాలంపూర్ వంటి ప్రధాన మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. అగ్నిపర్వతం నుంచి బూడిద మేఘాలు జావా వైపు 20,000 అడుగులు, సుమత్రా వైపు 50,000 అడుగుల ఎత్తు వరకు వ్యాపించాయి. నిరంతర భూ ప్రకంపనలు, లావా వెదజల్లడం, భారీ శబ్దాలతో ఆ ప్రాంతం దద్దరిల్లుతోంది. బూడిద కారణంగా కంటికి సంబంధించిన సమస్యలు తలెత్తడంతో కొన్ని ప్రాంతాల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. మత్స్యకారులు కూడా సముద్రంలోకి వేటకు వెళ్లలేదు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయటకు వెళ్లేటప్పుడు మాస్కులు, కళ్లజోళ్లు తప్పనిసరిగా ధరించాలని ఇండోనేషియా విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది. ప్రస్తుతానికి సునామీ ముప్పు ఏదీ లేదని అధికారులు స్పష్టం చేసినప్పటికీ, ప్రజల్లో ఆందోళన నెలకొంది. 2018లో ఇదే అగ్నిపర్వతం విస్ఫోటనం కారణంగా సంభవించిన సునామీలో 400 మందికి పైగా మరణించారు. పసిఫిక్ 'రింగ్ ఆఫ్ ఫైర్' ప్రాంతంలో ఉండటంతో ఇండోనేషియాలో తరచూ అగ్నిపర్వతాలు, భూకంపాలు సంభవించడం సాధారణమే.

## హైదరాబాద్ మెట్రోకు కొత్త కోచ్‌లు..
## తెరపైకి వచ్చిన సాంకేతిక సమస్య

(మొదటిపేజీ తరువాయి)
హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని తట్టుకునేందుకు మెట్రో రైలు వ్యవస్థలో అదనపు కోచ్‌లను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తుండగా, ఈ ప్రక్రియలో ఒక కీలకమైన సాంకేతిక సవాలు ఎదురైంది. కొత్తగా కొనుగోలు చేసే కోచ్‌లను పాత సిగ్నలింగ్ వ్యవస్థకు అనుగుణంగా తయారు చేయాలా? లేక మొత్తం సిగ్నలింగ్, ట్రైన్ కంట్రోల్ వ్యవస్థనే ఆధునికీకరించాలా? అనే అంశంపై తీవ్రంగా చర్చ జరుగుతోంది. అయితే, ప్రస్తుత వ్యవస్థను పూర్తిగా ఆధునికీకరించడమే దీర్ఘకాలంలో ప్రయోజనకరమని ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) నిపుణులు సూచించినట్లు తెలిసింది. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోలో 57 రైలు సెట్లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో రైలులో మూడు కోచ్‌లు ఉంటాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో కార్యాలయాలకు వెళ్లే వారి సంఖ్య భారీగా పెరగడంతో ఈ రైళ్లు ఏమాత్రం సరిపోవడం లేదు. ఈ నేపథ్యంలో ప్రయాణికుల ఇబ్బందులను తగ్గించేందుకు 60 కొత్త కోచ్‌లు, అంటే 10 కొత్త మూడు కోచ్‌ల ట్రైన్ సెట్లను కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. అయితే, దాదాపు 12 ఏళ్ల నాటి సాంకేతికతతో నడుస్తున్న ప్రస్తుత వ్యవస్థతో కొత్త కోచ్‌లను అనుసంధానించడం పెద్ద సవాలుగా మారింది. హైదరాబాద్ మెట్రో మొదటి దశలో ఏర్పాటు చేసిన రోలింగ్ స్టాక్‌ను ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ), ఆటోమేటిక్ ట్రైన్ ఆపరేషన్ (ఏటీఓ), కమ్యూనికేషన్ బేస్డ్ ట్రైన్ కంట్రోల్ (సీబీటీసీ) వంటి టెక్నాలజీలతో రూపొందించారు. ఇటీవల హైదరాబాద్‌లో పర్యటించిన డీఎంఆర్‌సీ ఇంజినీర్లు ఈ అంశంపై మెట్రో అధికారులతో చర్చించారు. పాత టెక్నాలజీకి అనుగుణంగా కొత్త కోచ్‌లను ప్రత్యేకంగా తయారు చేయించడం కంటే, మొత్తం సిగ్నలింగ్ వ్యవస్థను అప్‌గ్రేడ్ చేయడమే ఉత్తమమని వారు అభిప్రాయపడినట్లు సమాచారం. సిగ్నలింగ్ వ్యవస్థను ఆధునికీకరించి, ప్రస్తుతం ఉన్న పాత కోచ్‌లలో అవసరమైన మార్పులు చేస్తే, భవిష్యత్తులో కొత్త రైళ్లను సమీకరించడం చాలా సులభం అవుతుంది. దీనివల్ల పాత, కొత్త రైళ్ల మధ్య సాంకేతిక అనుసంధానం మెరుగుపడుతుంది. అంతేకాకుండా రైళ్ల భద్రత, వేగం, సమయపాలన మరింత మెరుగుపడతాయి. ఈ విధానం వల్ల మెట్రో వ్యవస్థ భవిష్యత్ అవసరాలకు తగ్గట్లుగా సిద్ధమవుతుందని, దీర్ఘకాలంలో నిర్వహణ కూడా సులభతరం అవుతుందని నిపుణులు భావిస్తున్నారు. ఈ సూచనల ఆధారంగా తుది నిర్ణయం తీసుకునేందుకు హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

## ప్రైవేటీకరణ అంటూ కథనాలు.. క్లారిటీ ఇచ్చిన ఇస్రో

(మొదటిపేజీ తరువాయి)
అత్యాధునిక అంతరిక్ష పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి, వ్యూహాత్మక ప్రయోగాలు, అంతరిక్ష విజ్ఞానం, అన్వేషణ వంటి కీలక రంగాలలో ఇస్రో దేశానికి ప్రధాన సంస్థగా కొనసాగుతుంది" అని ఆ ప్రకటనలో తేల్చిచెప్పింది. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వెనుక ఉద్దేశం ఇస్రో పాత్రను తగ్గించడం కాదని, మరింత ఉన్నతమైన లక్ష్యాలపై దృష్టి సారించేలా చేయడమేనని వివరించింది. 2020లో ప్రారంభమైన సంస్కరణలు, 2023 భారత అంతరిక్ష విధానం ద్వారా దేశంలో బలమైన, ప్రపంచంతో పోటీపడగల అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమని తెలిపింది. దీనివల్ల ఇస్రో ప్రాధాన్యం తగ్గదని, భారత అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ స్వరూపం, సామర్థ్యం విస్తరిస్తాయని పేర్కొంది. సాంకేతికంగా అభివృద్ధి చెందిన, పునరావృతమయ్యే పనులను పరిశ్రమలకు అప్పగించడం ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు, సిబ్బంది తమ సమయాన్ని అధునాతన పరిశోధనలు (ఆర్ అండ్ డీ), కొత్త తరం టెక్నాలజీలు, సంక్లిష్టమైన జాతీయ ప్రాజెక్టులపై కేంద్రీకరించగలరని ఇస్రో తెలిపింది. ఇది "ఇస్రో నేతృత్వంలోని జాతీయ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ"కు నాంది పలుకుతుందని వివరించింది.

**భవిష్యత్ లక్ష్యాలు ఇవే..**

భవిష్యత్తులో ఇస్రో పాత్ర మరింత బలోపేతం కానుంది. ముఖ్యంగా, మానవసహిత అంతరిక్ష యాత్రలు (గగన్‌యాన్), కొత్త తరం ప్రయోగ వాహనాలు, చంద్రుడు, ఇతర గ్రహాలపై పరిశోధనలు, 2035 నాటికి 'భారతీయ అంతరిక్ష్ స్టేషన్' ఏర్పాటు, 2040 నాటికి చంద్రుడిపైకి భారతీయుడిని పంపడం వంటి భారీ లక్ష్యాలపై ఇస్రో దృష్టి పెడుతుంది. ప్రస్తుతం 8.4 బిలియన్ డాలర్లుగా ఉన్న భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను 2033 నాటికి 44 బిలియన్ డాలర్లకు పెంచడమే లక్ష్యం. ఈ స్థాయి వృద్ధిని కేవలం ప్రభుత్వ వనరులతో సాధించడం అసాధ్యమని, దీనికి ప్రైవేట్ పెట్టుబడులు, పారిశ్రామిక సామర్థ్యం, ప్రపంచ మార్కెట్ అవసరమని ఇస్రో స్పష్టం చేసింది. 2020లో కొన్ని మాత్రమే ఉన్న స్పేస్ స్టార్టప్‌లు, నేడు 450కి పైగా పెరగడమే ఈ సంస్కరణల విజయానికి నిదర్శనమని పేర్కొంది.

## 'దిమాగీ నక్సల్' పిల్ ఇచ్చా.. వాళ్లంతా బయటకొచ్చారు

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విపక్ష నేతలపై మరోసారి తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. తాను గతంలో ప్రయోగించిన 'దిమాగీ నక్సల్' పదాన్ని పునరుద్ఘాటిస్తూ, అది ఒక హోమియోపతి మాత్రలా పనిచేసి విమర్శకుల అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని వ్యాఖ్యానించారు. నిన్న ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ) శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి మాట్లాడుతూ, తన ప్రభుత్వ పాలనను, గత ప్రభుత్వాల పనితీరును పోల్చి చూపిస్తూ పదునైన విమర్శలు చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "ఎర్రకోట నుంచి నేను చేసిన ప్రసంగం మీరు విని ఉండొచ్చు. నేను ఎర్రకోట నుంచి 'దిమాగీ నక్సల్' అనే ఒక హోమియోపతి పిల్ ఇచ్చాను. హోమియోపతి సూత్రాల ప్రకారం, చికిత్స ప్రారంభించినప్పుడు మొదట్లో వ్యాధి మరింత తీవ్రమవుతుంది. అదే హోమియోపతి స్వభావం" అని వివరించారు. "అదేవిధంగా, నేను 'దిమాగీ నక్సల్' పిల్ ఇవ్వగానే, దిమాగీ నక్సల్స్ ఒక్కొక్కరుగా బయటకు రావడం మొదలుపెట్టారు. ఈ వ్యాధిని ప్రోత్సహిస్తున్న వారి అసలు రంగును ఇప్పుడు ప్రజలు కూడా చూస్తున్నారు" అని అన్నారు. గతంలో దేశం ఎదుర్కొన్న సంక్షోభాలను నాటి ప్రభుత్వాలు ఎదుర్కొన్న తీరును ప్రధాని తీవ్రంగా విమర్శించారు. "నేను మీకు చాలా విషయాలు చెప్పాను. 'ఇదేంటి? ఇది 140 కోట్ల మంది ప్రజలున్న దేశం. ఇది చాలా సులభం. మోదీ కొత్తగా ఏం చేశారు?' అని కొందరు అనుకోవచ్చు. కానీ అది నిజంగా అంత సులభమా? నేను మిమ్మల్ని మరోసారి పాత రోజుల్లోకి తీసుకెళ్లాలనుకుంటున్నాను" అని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. 2013 నాటి కేదార్‌నాథ్ విపత్తును ప్రస్తావిస్తూ.. "అప్పుడు యావత్ ప్రభుత్వం కకావికలమైంది. ఏం చేయాలో, ఎలా స్పందించాలో వారికి తెలియలేదు" అని గుర్తుచేశారు. అదేవిధంగా 2008లో వచ్చిన ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని కూడా అప్పటి ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కోలేకపోయిందని విమర్శించారు. "2008లో బ్యాంకింగ్ సంక్షోభం వచ్చినప్పుడు, నాటి ప్రభుత్వం ఏళ్ల తరబడి ఆ సంక్షోభం చాటున దాక్కునే ప్రయత్నం చేసింది. దాన్ని ఎదుర్కొనే ధైర్యం కూడా వారికి లేదు. భారతదేశ మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థ పతనం అంచుకు నెట్టబడింది" అని ఆయన పేర్కొన్నారు. తన ప్రభుత్వం ఎదుర్కొన్న సవాళ్లను వివరిస్తూ, వాటిని ఎలా ధైర్యంగా ఎదుర్కొన్నారో మోదీ వివరించారు. "మొదట ప్రపంచాన్ని స్తంభింపజేసిన కోవిడ్ 19 మహమ్మారి వచ్చింది. ఆ తర్వాత రష్యా ఉక్రెయిన్ మధ్య యుద్ధం మొదలైంది. వాణిజ్యం, సరఫరా గొలుసులు ఆయుధాలుగా మారాయి. పశ్చిమాసియాలో సంక్షోభం తలెత్తింది. ప్రతీసారి 'ఇక భారత్ నిలబడదు' అని అన్నారు. నన్ను నా అతిపెద్ద ఆరాధకులు (విమర్శకులు) అయితే 'ఇప్పుడు మోదీ చిక్కుకున్నాడు, పడిపోయాడు, ఇక అతన్ని అణిచివేస్తారు' అని సంతోషించారు. కానీ, నా దేశ ప్రజల ఆశీర్వాదాలకు ఎంత శక్తి ఉందంటే, భారత్ విఫలం కావాలని కోరుకునే వారి ప్రతి కోరిక నెరవేరడం లేదు" అని మోదీ వ్యాఖ్యానించారు. 2013లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా మోదీ ఎస్ఆర్‌సీసీని సందర్శించారు. అప్పుడు విద్యార్థులను ఉద్దేశించి ఆయన చేసిన ప్రసంగం 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు సోషల్ మీడియాలో బాగా ప్రాచుర్యం పొందింది. ఇప్పుడు ప్రధాని హోదాలో అదే వేదికపై నుంచి ప్రసంగించడం గమనార్హం.

## తిరుపతికి చేరుకొన్న రిలయన్స్
## విద్యుత్తు బస్సులు



తిరుమల: తితిదేకు రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ తనయుడు అనంత్ అంబానీ విరాళంగా ప్రకటించిన 25 ఎలక్ట్రిక్ ధర్మరథం బస్సుల్లో 15 బస్సులు తిరుపతికి చేరుకున్నాయి. ఆదివారం వాటిలో ఓ బస్సు ట్రయల్‌రన్‌లో భాగంగా తిరుమలకు వచ్చింది. స్థానిక రింగురోడ్డులోని తితిదే ఎలక్ట్రిక్ బస్‌స్టేషన్‌లో ఆ బస్సుకు ఛార్జింగ్ పెట్టారు. ఈ బస్సు పనితీరును తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి పరిశీలించనున్నారు. ఈ ఏడాది జూన్‌లో శ్రీవారిని దర్శించుకున్న అనంత్ అంబానీ తితిదేకు రూ.27.5 కోట్ల విలువైన 25 ఎలక్ట్రిక్ బస్సులు, వాటికి అవసరమైన 50 మంది డ్రైవర్లు, ఛార్జింగ్ స్టేషన్‌ను రిలయన్స్ సంస్థ విరాళంగా అందిస్తుందని ప్రకటించారు. ఈ బస్సులను శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నట్లు తితిదే అధికారులు తెలిపారు.

## భవనం కూలి ముగ్గురి మృతి ఢిల్లీలో విషాదం

దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సౌత్ ఢిల్లీలోని సత్య నికేతన్ ప్రాంతంలో మరమ్మతు పనులు జరుపుకుంటున్న ఐదంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు మృతి చెందగా, ఇప్పటివరకు ఆరుగురిని సహాయక బృందాలు సురక్షితంగా వెలికితీశాయి. శిథిలాల కింద మరికొంతమంది చిక్కుకుని ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఉన్నతస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కూలిపోయిన భవనం సుమారు 4050 ఏళ్ల నాటిది. బేస్‌మెంట్‌తో కలిపి మొత్తం ఐదు అంతస్తులున్న ఈ భవనాన్ని పేయింగ్ గెస్ట్ (పీజీ) వసతి గృహంగా ఉపయోగిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బేస్‌మెంట్‌లో మరమ్మతు పనులు జరుగుతున్నాయి. శిథిలాల కింద నుంచి వెలికితీసిన ఒక వ్యక్తిని ఎయిమ్స్ ట్రామా సెంటర్‌కు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ సింగ్ హుడా మాట్లాడుతూ, ఇది రాజకీయ విమర్శలు చేసే సమయం కానప్పటికీ, జవాబుదారీతనం ఎక్కడ అని ప్రశ్నించారు. "ఈ ప్రాంతంలో పీజీలు ఏ పరిస్థితుల్లో నడుస్తున్నాయో అందరికీ తెలుసు. వాటికి లేఅవుట్ ప్లాన్లను ఎవరు మంజూరు చేస్తున్నారు? అగ్నిమాపక భద్రతను ఎవరు ధ్రువీకరిస్తున్నారు? మున్సిపల్ కార్పొరేషన్, ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేల పాత్ర ఏమిటి? ఎవరో ఒకరు బాధ్యత వహించాలి" అని ఆయన నిలదీశారు. విద్యార్థులే శిథిలాల నుంచి ముగ్గురిని బయటకు లాగారని, ప్రభుత్వం దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆప్ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈ ఘటనను అత్యంత విషాదకరమని అభివర్ణించారు. "ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఢిల్లీలో ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇకనైనా నిద్రమత్తు వీడి పౌరుల భద్రతకు చర్యలు తీసుకోవాలి" అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.



# ఇంట్లో కూర్చునే... కొనొచ్చు అమ్మొచ్చు

**'మన ప్లాట్ హైవేకి చాలా దగ్గర సార్...', 'ఇంత చౌకగా మీకింకెక్కడా ఇల్లు దొరకదు మేడమ్...' రియల్ ఎస్టేట్ బ్రోకర్లు ఇలా గాల్లో మేడలు కడతారు... తీరా వెళ్లిచూస్తే, అవన్నీ అబద్ధాలే అని తెలుస్తుంది. ఆఫీసుకి సెలవు పెట్టి మరీ వెతగ్గా, వెతగ్గా ఒక మంచి ఇల్లు దొరికితే- ఇంటీరియర్ వర్క్ ఎవరికి అప్పగించాలని మరో సందేహం. ఇక, ఆ ఇంటిని అద్దెకు ఇవ్వాలంటే ఎటువంటి వాళ్లు వస్తారో అనే చింత... ఈ సమస్యలన్నింటికీ టెక్నాలజీ సాయంతో చెక్‌పెడుతూ యూనికార్న్ సంస్థగా ఎదిగింది 'స్క్వేర్‌యార్డ్స్'...**

పెద్ద చదువులు చదువుకుని విదేశాల్లో స్థిరపడ్డా సొంతూళ్లో ఒక ఇల్లో, స్థలమో కొనుక్కున్నప్పుడు వచ్చే ఆ సంతృప్తి వేరు. హాంకాంగ్‌లో ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్‌గా స్థిరపడ్డ తనుజ్ శోరీ, కనికాగుప్తా దంపతులు కూడా ఇలానే అనుకున్నారు. కానీ బ్రోకర్లు చెప్పేదొకటీ అక్కడున్నది మరొకటి... స్థలం అసలు ధర ఎంతో తెలిసేది కాదు, న్యాయపరమైన అనుమతులు ఉండేవి కావు, కొన్ని అప్పటికే ఎవరి పేరుమీదో రిజిస్ట్రేషన్ అయి ఉండేవి. ఇలాంటి అనుభవాలు తనుజ్‌శోరీని ఆలోచింపచేశాయి. దాంతో, ఈ చిక్కులన్నీ లేకుండా సులభంగా ఇల్లు లేదా స్థలాన్ని కొనే ఒక వేదికని ఏర్పాటు చేయాలనుకున్నాడు. తనుజ్ ఐఐఎమ్ లఖ్‌నవూలో చదువుకుని స్టాండర్డ్ చార్టెడ్ బ్యాంక్, నొమూరా ఇంటర్నేషనల్ బ్యాంకుల్లో ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్‌గా పనిచేశాడు. తనుజ్ భార్య కనికాగుప్తా వార్టన్ బిజినెస్ స్కూల్లో చదువుకుని వెల్త్‌మేనేజర్‌గా పనిచేస్తోంది. ఈ ఇద్దరూ ఇండియాలో ఆస్తి కొనుగోళ్ల విషయంలో బ్రోకర్లు ఇచ్చే అరకొర సమాచారంపైన కాకుండా, కచ్చితమైన డేటాపైన ఆధారపడేలా చేయాలనుకున్నారు. ఇందుకోసం తమ ఉద్యోగాలు వదులుకుని అంతవరకూ దాచుకున్న సేవింగ్స్‌తో 2015లో 'స్క్వేర్‌యార్డ్స్' స్టార్టప్‌ని మొదలుపెట్టారు. ఇదొక ఆన్‌లైన్ వేదిక... హాంకాంగ్, సింగపూర్, దుబాయ్‌ల్లో ఉంటూ ఇండియాలో ఇళ్లు కొనాలనుకునే వారికి సాయం చేస్తుంది. కానీ మనదేశంలో భూముల విషయంలో ఎదురయ్యే చిక్కులు చూశాక కేవలం ఆన్‌లైన్ సంస్థగా ఉండిపోవడం వల్ల పెద్దగా ప్రయోజనం లేదని దిల్లీ, బెంగళూరు, ముంబై, పుణెలతోపాటు విదేశాల్లోనూ ఆఫీసుల్ని తెరిచి, స్థలాలని దగ్గరుండి చూపించేసిబ్బందిని నియమించుకున్నారు



తనుజ్, కనికాలు. కానీ ఇవన్నీ సంస్థ ఖర్చులని తడిసిమోపెడయ్యేలా చేశాయి. 'ఏడాదికి రూ.రెండువందల కోట్లకుపైగా



నష్టం వచ్చేది, అలాగని వెనక్కి అడుగు వేయలేని పరిస్థితి. ఎందుకంటే మేం దాచుకున్న డబ్బులనే కాదు, పెద్దవాళ్లు ఇచ్చిన ఆస్తులనీ అమ్మి పెట్టుబడులు పెట్టాం. కాబట్టి చావోరేవో తేల్చుకోవాల్సిన పరిస్థితి' అనే తనుజ్ సంస్థని నష్టాల నుంచి బయటపడేసేందుకు ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్‌గా తనకున్న అనుభవంతో కొన్ని తెలివైన నిర్ణయాలు తీసుకున్నాడు. కేవలం ఇళ్లని చూపించడంతో సరిపెట్టకుండా తగిన రుణాలు ఇప్పించేందుకు వీలుగా హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ వంటి వందకు పైగా సంస్థలతో ఒప్పందాలు చేసుకుని 'అర్బన్ మనీ' అనే మరో విభాగాన్నీ ప్రారంభించాడు. రుణాలని పొందడం తేలిక చేసిన ఈ విభాగం సంస్థని లాభాల బాట పట్టించింది. కానీ కొద్దిరోజులకే కొవిడ్ సంక్షోభం తలెత్తడంతో.... బయటకు వచ్చి ఇళ్లను చూసి, కొనుగోలు చేసే వారి సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. అప్పుడే స్క్వేర్‌యార్డ్స్ సాధారణ రియల్‌ఎస్టేట్ సెర్చ్ ఇంజన్‌నుంచి ఆధునిక టెక్నాలజీవైపు మలుపు తిరిగి ప్రాప్‌టెక్(ప్రాపర్టీ టెక్నాలజీ) సంస్థగా మారింది.

**వర్చ్యువల్‌గా చూపించి...**

కొవిడ్‌లో ఇళ్ల ధరలు తగ్గాయి, కానీ వాటిని బయటకు వచ్చి చూసి కొనుక్కోలేని పరిస్థితి. ఆ సమయంలోనే స్క్వేర్‌యార్డ్స్ ప్రాప్‌వీఆర్ అనే విభాగాన్ని ప్రారంభించింది. ఇందులో పూర్తయిన భవనాల ప్రాజెక్టులకి సంబంధించిన 'డిజిటల్ ట్విన్స్' ఉంటాయి. ఎక్కడకూ వెళ్లకుండా ఇంట్లోనే కూర్చుని ఫోన్ లేదా ల్యాప్‌టాప్‌లో 'ఇంటరాక్టివ్ నావిగేషన్' పద్ధతిలో అన్ని గదులనీ 360 డిగ్రీల కోణంలో చూడొచ్చు. 'డ్రోన్‌వ్యూ' సాయంతో ఇంటి చుట్టుపక్కల ప్రాంతాలనీ చూడొచ్చు. వాస్తు కాలిక్యులేటర్ సాయంతో నచ్చిన మార్పులు సూచించవచ్చు. కావాల్సిన ఇంటీరియర్ వర్క్‌నీ ఈ సంస్థ చేసి పెడుతుంది. ఆ ఇల్లు ఎవరికైనా అద్దెకు ఇవ్వడానికి వీలుగా 'అజురో' అనే యాప్‌నీ ప్రారంభించింది. ఇది అద్దెకు వచ్చేవాళ్ల వివరాలని తనిఖీ చేసి, యజమానికి ఇస్తుంది. వాళ్ల నుంచి అద్దెలు వసూలు చేసి పెడుతుంది... ఎలక్ట్రిషియన్, ప్లంబర్ వంటి వాళ్లని చిటికెలో ఏర్పాటుచేస్తుంది. ఎప్పటికప్పుడు అద్దెకున్నవాళ్లు ఇంటిని ఎలా ఉంచుతున్నారో తెలుసుకునేందుకు ఇన్‌స్పెక్షన్ బృందాలని ఏర్పాటు చేస్తుంది. ఇవన్నీ చేసేందుకు స్క్వేర్‌యార్డ్స్ 17 విభాగాలని ఏర్పాటు చేసింది. ఇళ్లూ, కొనుగోళ్లకి సంబంధించిన సేవలన్నీ ఒక చోట ఏర్పాటుచేయడంతో ఇన్వెస్టర్లు పెద్దమొత్తంలో పెట్టుబడులు అందించారు. అలా స్క్వేర్‌యార్డ్స్ ఎనిమిదిన్నరవేల కోట్ల రూపాయల విలువతో యూనికార్న్‌గా అవతరించింది.




## చరిత్రలో ఈ రోజు
### సెప్టెంబర్ 7

SEPTEMBER 7

* 1533: ఇంగ్లాండు మహారాణి ఎలిజబెత్ I జననం (మ.1603).
* 1914: తెలుగు సాహిత్యంలో పేరడీలకు ఆద్యుడు జరుక్ శాస్త్రి జననం (మ.1968).
* 1925: ప్రముఖ నటీమణి భానుమతి జననం (మ.2005).
* 1953: మలయాళ సినిమా అగ్రనటుల్లో ప్రముఖుడు మమ్ముట్టి జననం.
* 1976: తెలుగు సినిమా సంగీత దర్శకులు భీమవరపు నరసింహారావు మరణం. (జ.1905)
* 1986: తెలుగు సినిమా నిర్మాత, రచయిత, దర్శకుడు పి.ఎస్. రామకృష్ణారావు మరణం (జ.1918).
* 1990: ప్రఖ్యాత రేడియో వ్యాఖ్యాత, సాహిత్య రచయిత ఉషశ్రీ మరణం (జ.1928).
* 1983: భారత బ్యాడ్మింటన్ క్రీడాకారిణి గుత్తా జ్వాల జననం. (చిత్రంలో)
* 1991: తెలంగాణాలో కమ్యూనిస్ట్ పక్ష స్థాపన, నిర్మాణ, నిర్వహణలో, రైతు,కార్మిక,విద్యార్థి సంఘాల నిర్వహణలోప్రముఖ పాత్ర వహించిన రావి నారాయణ రెడ్డి మరణం (జ. 1908 )



గుత్తా జ్వాల

* 2004: తొలి తెలుగు టాకీ చిత్రమైన భక్తప్రహ్లాదలో ప్రహ్లాదునిగా నటించిన బాలనటుడు కృష్ణాజిరావు సింధే మరణం (జ.1923).
* 2017: తెలుగు వికీపీడియా సభ్యుడు ప్రణయ్‌రాజ్ వంగరి 'వికీవత్సరం' అనే కాన్సెప్ట్‌తో వరుసగా 365రోజులు - 365 వ్యాసాలు రాసి ప్రపంచ రికార్డు సాధించాడు.



## భోగాపురంలో దారుణం.. చేతులు, మెడకు తాళ్లు కట్టి నడిరోడ్డుపై లాక్కుంటూ..

డెంకాడ: విజయనగరం జిల్లా భోగాపురంలో దారుణం చోటుచేసుకుంది. ఓ యువకుడిపై మెకానిక్ మహేశ్ దౌర్జన్యానికి పాల్పడ్డాడు. చేతులు, మెడకు తాళ్లు కట్టి తొలుత నడిపించుకుంటూ.. ఆ తర్వాత బైక్‌తో లాక్కుంటూ నడిరోడ్డుపై తిప్పాడు. బైక్ రిపేర్ డబ్బులు ఇవ్వలేదనే కారణంతో మెకానిక్ ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. బాధితుడిని రామచంద్రరాజుపేటకు చెందిన యువకుడికిగా గుర్తించారు. మెకానిక్ మహేశ్‌తో పాటు అతడికి సహకరించిన మరో నలుగురిని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ దామోదర్ తెలిపారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామన్నారు.

### జగన్‌కు డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి
## తేడా తెలియదు: చింతకాయల విజయ్

విజయవాడ: ఉపాధ్యాయులపై వైకాపా అధినేత జగన్‌కు ఏమాత్రం గౌరవం లేదని రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్ విమర్శించారు. దేవుళ్లుగా భావించే గురువులను గత ప్రభుత్వంలో వైన్ షాపుల వద్ద క్యూ లైన్లలో నిలబెట్టి అవమానించారని ధ్వజమెత్తారు. డీఎస్సీ, ఏపీపీఎస్సీ మధ్య కనీస తేడా కూడా తెలియని వ్యక్తి జగన్ అని ఎద్దేవా చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యమై.. 12 లక్షల మంది విద్యార్థులు బడికి దూరమయ్యారని మండిపడ్డారు. 16 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగుల పట్ల మంత్రి నారా లోకేష్ చిత్తశుద్ధిని చాటుకున్నారని స్పష్టం చేశారు. ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ పోస్టు



కూడా భర్తీ చేయని వైకాపా ప్రభుత్వం ఇప్పుడు అవాస్తవాలు ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. చట్టసభలకు వచ్చే ధైర్యం లేకపోయినా ప్రెస్‌మీట్ల ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని జగన్‌పై విమర్శలు గుప్పించారు.

### ఏపీలో కొత్త పింఛన్లు..
## దరఖాస్తులకు ప్రభుత్వం శ్రీకారం

అమరావతి: ఏపీలో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తుల స్వీకరణకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు సహా వివిధ వర్గాల నుంచి సెప్టెంబర్ 7 నుంచి 16 వరకు దరఖాస్తులు స్వీకరించనుంది. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి.. దరఖాస్తుల పరిశీలన, అర్హత నిర్ధరణ అనంతరం దశలవారీగా కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 61,92,396 మంది పింఛనుదారులకు నెలకు రూ.2,694 కోట్ల మేర పంపిణీ చేస్తుండగా.. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు పింఛన్ల కోసం రూ.73,508 కోట్లు ఖర్చు చేసింది.

# విశాఖ జూకు కొత్త అతిథులు.. ఇక సందర్శకులకు డబుల్ ఆనందం!

- **విశాఖ జూకు గుజరాత్ నుంచి కొత్త జంతువుల రాక**
- **జంతు మార్పిడి విధానంలో భాగంగా వచ్చిన జీబ్రాలు, వాలీలు**
- **వైజాగ్ నుంచి గౌర్‌లు, మొసళ్లను గుజరాత్‌కు తరలింపు**
- **క్వారంటైన్ తర్వాత సందర్శకులకు అందుబాటులోకి కొత్త జీవులు**
- **ఇటీవల జూలో 128 కొత్త జీవాలు జన్మించడంతో పెరిగిన సందడి**

విశాఖపట్నంలోని ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాల కొత్త కళను సంతరించుకుంది. సందర్శకులను మరింత ఆకట్టుకునేందుకు గుజరాత్ నుంచి అరుదైన, విదేశీ జంతువులు ఇక్కడికి చేరుకున్నాయి. జంతు మార్పిడి విధానంలో భాగంగా జీబ్రాలు, రెడ్ నెక్డ్ వాలీలతో పాటు ప్రత్యేకమైన కోతి జాతులను విశాఖకు తీసుకొచ్చారు. ఈ కొత్త జీవుల రాకతో జూలో సందడి వాతావరణం నెలకొంది. జంతు మార్పిడి కార్యక్రమంలో భాగంగా గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఉన్న రాధే కృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్ట్ నుంచి ఈ కొత్త జీవాలను విశాఖకు తీసుకొచ్చినట్లు జూ క్యూరేటర్ జి. మంగమ్మ తెలిపారు. వచ్చిన వాటిలో ఒక మగ, రెండు ఆడ జీబ్రాలు, ఒక మగ, రెండు ఆడ రెడ్ నెక్డ్ వాలీలు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. వీటితో పాటు రెండు జతల కాటన్ టాప్ టామరిన్ కోతులు, ఒక మగ, రెండు ఆడ కామన్ మార్మోసెట్ కోతులు కూడా ఉన్నట్లు వివరించారు. ఈ మార్పిడిలో




భాగంగా విశాఖ జూ నుంచి ఒక జత ఇండియన్ గౌర్ (అడవి దున్న), రెండు జతల స్టంప్ టైల్డ్ మకావ్ కోతులు, ఒక జత ఘారియల్ మొసళ్లను గుజరాత్‌కు పంపించారు. వెటర్నరీ అధికారుల పర్యవేక్షణలో ఈ జంతువులను సురక్షితంగా విశాఖకు చేర్చామని, ప్రస్తుతం వీటిని క్వారంటైన్‌లో ఉంచామని మంగమ్మ తెలిపారు. క్వారంటైన్ గడువు ముగిసిన తర్వాత సందర్శకుల వీక్షణ కోసం వాటికి కేటాయించిన ప్రత్యేక ఎన్‌క్లోజర్‌లలోకి విడుదల చేస్తామని ఆమె వెల్లడించారు.

**ఇటీవల 128 కొత్త జీవాల జననం**

ఇదిలా ఉండగా, ఇటీవలి కాలంలో విశాఖ జూలో జంతు సంపద గణనీయంగా పెరిగింది. 12 రకాల జాతులకు చెందిన మొత్తం 128 కొత్త జీవాలు జన్మించినట్లు అటవీ శాఖ అధికారికంగా ప్రకటించింది. వీటిలో 40 స్టార్ తాబేళ్లు, 35 అడవి పందులు, 20 చుక్కల జింకలు, సాంబార్ జింకలు, హైనాలు, బైసన్‌లు వంటివి ఉన్నాయి. ఈ పరిణామంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా హర్షం వ్యక్తం చేశారు. ఈ కొత్త జంతువుల రాక, ఇటీవల జన్మించిన జీవాలతో విశాఖ జూ సందర్శకులకు మరింత ఆహ్లాదాన్ని పంచనుంది.

## ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య..
# ముగ్గురి మృతదేహాలు లభ్యం

ఆర్థిక ఇబ్బందులతో గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో ముగ్గురి మృతదేహాలు దొరికాయి. వీరవాసరం మండలం మత్స్యపురికి చెందిన నంబూరి శ్రీనివాస్(45), పద్మిని(42) దంపతులు. వీరికి వెంకట ఈశ్వర్(16), నిత్యశ్రీ(12) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక శనివారం తెల్లవారుజామున కుటుంబంతో సహా చించినాడ వంతెన వద్దకు వచ్చి గోదావరిలో దూకారు. అక్కడి జాలర్లు వెంటనే పద్మినిని కాపాడారు. ఇప్పుడు ముగ్గురి మృతదేహాలు సఖినేటిపల్లి మండలం దిండి


శ్రీనివాస్ | వెంకట ఈశ్వర్ | నిత్యశ్రీ

వద్ద గుర్తించారు. శ్రీనివాస్ ఇరవై ఏళ్ల క్రితం కుటుంబంతో సహా తణుకు వచ్చి కొట్టువారి వీధిలో స్థిరపడ్డారు. పట్టణంలో ఓ దుకాణం అద్దెకు తీసుకొని పాలు, కిరాణా వ్యాపారం చేస్తున్నారు. అది అంతంతమాత్రంగానే సాగుతుండటంతో అప్పులు చేశారు. ఇటీవల వాటిని చెల్లించాలని వడ్డీ వ్యాపారులు ఒత్తిడి చేశారు. పద్మిని పేరిట రాసిన రెండు లేఖలను పోలీసులు గుర్తించారు. 'మేం నలుగురు సూసైడ్ చేసుకోవడానికి వెళ్తున్నాం. మా గురించి ఎవరూ వెతకొద్దు. ఇంటి కాగితాలకు రూ.2.60 లక్షలు కట్టాలి. పైన నంబర్‌కు ఫోన్ చేసి కాగితాలు తెచ్చుకో. అమ్మా నన్ను క్షమించు' అని వాటిల్లో రాసి ఉంది.

# టీడీపీ నేత వసంత్ కుమార్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి లోకేశ్

- **ఇటీవల టీడీపీ నేత చెరుకూరి వసంత్ కుమార్ మృతి**
- **చిత్తూరు జిల్లా పెద్దకాల్వ గ్రామంలో లోకేశ్ పర్యటన**
- **వసంత్ కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు**
- **పార్టీకి ఆయన సేవలను గుర్తు చేసుకున్న లోకేశ్**
- **కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ**

రాష్ట్ర మంత్రి, తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ చిత్తూరు జిల్లాలో పర్యటించారు. ఇటీవల కన్నుమూసిన టీడీపీ సీనియర్ నేత చెరుకూరి వసంత్ కుమార్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. గంగాధర నెల్లూరు మండలం పెద్దకాల్వ గ్రామంలోని వసంత్ కుమార్ నివాసానికి వెళ్లిన లోకేశ్, ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా వసంత్ కుమార్ చిత్రపటానికి లోకేశ్ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పార్టీకి



ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన లోకేశ్, వారికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ పర్యటనకు సంబంధించిన వివరాలను, ఫొటోలను నారా లోకేశ్ తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు.







## రాజమహేంద్రవరంలో
# 'ఆదిరెడ్డి ప్రీమియర్ పికిల్‌బాల్ లీగ్'

రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరంలో ఈ నెల 11, 12, 13 తేదీల్లో 'ఆదిరెడ్డి ప్రీమియర్ పికిల్‌బాల్ లీగ్' నిర్వహించనున్నట్లు రాజమహేంద్రవరం అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యంగా టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.30వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20వేలు, తృతీయ బహుమతిగా రూ.15వేలు అందజేస్తామని తెలిపారు. నగరాన్ని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. రూ.14 కోట్లతో మోరంపూడి వద్ద నిర్మిస్తోన్న మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఫిబ్రవరిలో ప్రారంభిస్తామని చెప్పారు. "ఏపీ పేపర్ మిల్లుపై జరిమానా విధిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా. ఆ మిల్లు ద్వారా గోదావరి నది కాలుష్యం జరుగుతోంది. మిల్లు యాజమాన్యంలో



మార్పులు రావాలి. కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవడం సహా పన్ను బకాయిలు చెల్లించాలి. కాలుష్యాన్ని విడుదల చేస్తూ సహజ నదీవనరులను పాడు చేస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదు. పేపర్ మిల్లు కేసు కోర్టులో ఉంది. దానికి అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటాం. నిబంధనల ప్రకారం నడుచుకుంటే పరిశ్రమలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది" అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు.




# పవన్ కల్యాణ్ చొరవతో రంగంలోకి మద్రాస్ ఐఐటీ బృందం

- **ఉప్పాడ తీర రక్షణ గోడ నిర్మాణానికి సర్వే పనులు ప్రారంభం**
- **డిజైన్, డీపీఆర్ రూపకల్పన కోసం రంగంలోకి ఐఐటీ మద్రాస్ నిపుణులు**
- **డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవతో కదులుతున్న పనులు**
- **అత్యాధునిక టెక్నాలజీతో తీరప్రాంతంపై సమగ్ర అధ్యయనం**
- **దశాబ్దాల సముద్ర కోత సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు**



దశాబ్దాలుగా సముద్ర కోతతో విలవిలలాడుతున్న పిఠాపురం నియోజకవర్గంలోని ఉప్పాడ తీరప్రాంత వాసుల చిరకాల స్వప్నం సాకారం దిశగా కీలక ముందడుగు పడింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవతో తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించిన పనులు వేగవంతమయ్యాయి. ఈ ప్రాజెక్టు డిజైన్, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పన కోసం ప్రతిష్ఠాత్మక ఐఐటీమద్రాస్ నిపుణుల బృందం రంగంలోకి దిగింది. గత వారం రోజులుగా ఐఐటీ మద్రాస్‌కు చెందిన ఐదుగురు సభ్యుల నిపుణుల బృందం ఉప్పాడ తీరంలో క్షేత్రస్థాయి సర్వేను ప్రారంభించింది. అత్యాధునిక డ్రోన్లు, బీచ్ ప్రొఫైలింగ్, ట్రింబుల్ ఆర్980 జీఎన్ఎస్ఎస్ ఆర్‌టీకే వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తీరం వెంబడి సమగ్ర అధ్యయనం చేస్తున్నారు. సముద్ర గర్భంలోనూ, తీరం పొడవునా భౌగోళిక పరిస్థితులు, అలల తీవ్రత, సముద్ర ప్రవాహాల దిశ, కోతకు గల కారణాలను శాస్త్రీయంగా విశ్లేషిస్తున్నారు. ఇందులో భాగంగా సముద్రపు లోతును కొలిచే బాతిమెట్రిక్ సర్వేతో పాటు, తీరంలోని ఇసుక, మట్టి నమూనాలను సేకరించి పరీక్షిస్తున్నారు. గత 40 ఏళ్లుగా ఉప్పాడ తీరంలో సముద్ర కోత కారణంగా వందల ఎకరాల భూమి, కొన్ని గ్రామాలు సముద్రంలో కలిసిపోయాయి. ఎందరో మత్స్యకారులు, రైతులు సర్వం కోల్పోయి నిర్వాసితులుగా మారారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు నడుం బిగించిన పవన్ కల్యాణ్, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.323 కోట్ల జాతీయ విపత్తు నిర్వహణ నిధిని సాధించారు. ఈ ప్రాజెక్టు పనులను పవన్ కల్యాణ్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. డిజైన్, డీపీఆర్ రూపకల్పనతో పాటు సమాంతరంగా పర్యావరణ అనుమతుల ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. త్వరలో పిఠాపురం పర్యటన సందర్భంగా ఐఐటీ నిపుణులతో సమావేశమై పనుల పురోగతిని సమీక్షించనున్నారు. ఈ సర్వే పూర్తయిన తర్వాత ఐఐటీ మద్రాస్ ఇచ్చే నివేదిక ఆధారంగా రక్షణ గోడ డిజైన్‌ను ఖరారు చేసి, నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు.







# టోల్‌గేట్ వద్ద వాహనదారుల నుంచి అక్రమ వసూళ్లు.. నెల్లూరులో రవాణా అధికారి అరెస్ట్

ఆంధ్రప్రదేశ్‌లో రవాణా శాఖలో అవినీతి మరోసారి బట్టబయలైంది. వాహనదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న అధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మెరుపుదాడులు నిర్వహించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో జరిపిన ఈ ఆకస్మిక తనిఖీల్లో సుమారు రూ. 2.5 లక్షలకు పైగా లెక్కల్లో చూపని నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఓ మోటారు వాహన తనిఖీ అధికారి (ఎంవీఐ)ని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. సెప్టెంబర్ 5, 6 తేదీల మధ్య రాత్రి నెల్లూరు జిల్లా కావలి సమీపంలోని జాతీయ రహదారి 16పై ఉన్న ముసునూరు టోల్‌ప్లాజా వద్ద రవాణా శాఖ అధికారులు వాహనదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఏసీబీకి పక్కా సమాచారం అందింది. దీంతో ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడి చేశారు. ఈ తనిఖీల్లో జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో ఎంవీఐగా పనిచేస్తున్న బానావత్ గోపీ నాయక్.. ఇద్దరు హోంగార్డులు, ఒక ప్రైవేట్ డ్రైవర్ సాయంతో లంచాలు స్వీకరిస్తున్నట్లు గుర్తించారు. తనిఖీల సమయంలో రోడ్డు పక్కన పడి ఉన్న రూ. 68,800 నగదును అధికారులు గుర్తించారు. అనంతరం ఎంవీఐ గోపీ నాయక్ ప్రయాణిస్తున్న కియా సెల్టోస్ కారును సోదా చేయగా, డిక్కీలో దాచిపెట్టిన రూ. 1,80,000 నగదు బయటపడింది. ఈ మొత్తం రూ. 2,48,800కు ఎలాంటి లెక్కలు లేకపోవడంతో అక్రమ వసూళ్లకు సంబంధించినదిగా భావిస్తూ ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై తదుపరి విచారణ నిమిత్తం కేసు నమోదు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ అధికారులపై లంచాల ఆరోపణలు తరచూ వస్తున్న నేపథ్యంలో ఈ ఘటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఏడాది మార్చి నెలలో కూడా ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై మచిలీపట్నంలో ఏఎంవీఐగా పనిచేస్తున్న లోకనాధ ప్రసాద్‌పై ఏసీబీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

# తెలంగాణలో 369 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు టెండర్లు

హైదరాబాద్: రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని మరింత వేగవంతం చేయడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ మౌలిక వసతులను భారీగా విస్తరించేందుకు తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీ రెడ్కో) కీలక చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా మొత్తం 369 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల (EV charging stations) ఏర్పాటు, నిర్వహణ, అప్‌గ్రేడేషన్, వాణిజ్య నిర్వహణ కోసం ప్రైవేట్ ఛార్జ్ పాయింట్ ఆపరేటర్ల (సీపీఓలు) కోసం టెండర్లు ఆహ్వానించింది. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వాటికి అనుగుణంగా పబ్లిక్ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను విస్తరించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పెరుగుతున్న ఈవీ మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ రంగం ఈ అవకాశాలను అందిపుచ్చుకునేలా ఈవీ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని రెడ్కో వీసీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ పేర్కొన్నారు. హైదరాబాద్ పరిధిలో గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరిలోని పలు ప్రాంతాలను కవర్ చేస్తూ రెడ్కో సంస్థ ఏర్పాటు చేసిన 200 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఆరు క్లస్టర్లుగా అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన సీపీవోలు వీటి ఆపరేషన్, మెయింటెనెన్స్, అప్‌గ్రేడేషన్, వాణిజ్య నిర్వహణ బాధ్యతలను చేపడతారని, ప్రాజెక్టు కాంట్రాక్ట్ కాలం 10 సంవత్సరాలు ఉంటుందన్నారు.



టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లోని 16 ప్రాంతాల్లోనూ 169 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. రెండు ప్రాజెక్టుల్లోనూ వినియోగదారుల కోసం ఈవీ ఛార్జింగ్ టారిఫ్‌ను యూనిట్‌కు రూ.13 (GST అదనం)గా నిర్ణయించామన్నారు. కాంట్రాక్ట్ కాలం మొత్తం ఇదే టారిఫ్ అమల్లో ఉంటుంది అని ఆయన స్పష్టం చేశారు. 169 ఛార్జింగ్ స్టేషన్ల ప్రాజెక్టుకు సెప్టెంబర్ 7న ఉదయం 11.30 గంటలకు, 200 ఛార్జింగ్ స్టేషన్ల ప్రాజెక్టుకు అదే రోజు ఉదయం 11 గంటలకు ప్రీబిడ్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. బిడ్ల సమర్పణ ప్రక్రియ సెప్టెంబర్ 8 నుంచి ప్రారంభమై సెప్టెంబర్ 22న ముగుస్తుందన్నారు. టెండర్లను తెలంగాణ ఈప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ ద్వారా సమర్పించాలని చెప్పారు.

## ఇద్దరు పిల్లలతో కలిసి దంపతుల అదృశ్యం

అచ్చంపేట న్యూటౌన్: నాగర్‌కర్నూలు జిల్లాలో పిల్లలతో కలిసి దంపతులు అదృశ్యమయ్యారు. వివరాల్లోకి వెళితే.. ఉప్పునుంతల మండలం తాడూరు గ్రామానికి చెందిన పి.ప్రభాకర్.. తన భార్య తేజ, ఇద్దరు పిల్లలతో కలిసి అచ్చంపేటలో నివాసముంటున్నారు. గతంలో ప్రభాకర్ ఆటోమొబైల్ దుకాణం నిర్వహించాడు. కొన్నాళ్ల



క్రితం అది మూతపడింది. మూడు రోజులుగా ఇంటి వద్ద ప్రభాకర్, ఆయన భార్య, పిల్లలు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆచూకీ కోసం ప్రయత్నాలు చేశారు. ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అప్పుల బాధతో కుటుంబం మొత్తం అదృశ్యమైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

## కాంగ్రెస్ వెయ్యిరోజుల పాలన అట్టర్ ఫ్లాప్: కేసీఆర్

సిద్దిపేట: అసెంబ్లీ సమావేశాలకు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తప్పకుండా హాజరుకావాలని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ (KCR) దిశానిర్దేశం చేశారు. శాసనసభ, మండలిలో జరిగే ప్రతి చర్చలో పాల్గొనాలన్నారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ పలు సూచనలు చేశారు. ఈ సమావేశాలను ఎవరూ లైట్ తీసుకోవద్దన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "శాసనసభ, మండలిలో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి. ప్రజల అజెండానే బీఆర్ఎస్ అజెండాగా ఉండాలి.



కాంగ్రెస్, భాజపా విధానాలను ఎండగట్టాలి. స్పీకర్ పక్షపాత ధోరణి, అప్రజాస్వామిక విధానాలపై నిలదీయాలి. కాంగ్రెస్ వెయ్యిరోజుల పాలన అట్టర్‌ఫ్లాప్. తమ ప్రభుత్వం మళ్లీరాదని కాంగ్రెస్ నేతలకు అర్థమైంది. అందుకే అడ్డగోలుగా దోపిడీ చేస్తున్నారు. నా చావు కోరుతూ పదేపదే మాట్లాడుతున్నారు. పాలన చేతకాకే రేవంత్‌రెడ్డి బూతు పురాణం. అలాంటి వ్యక్తితో చర్చకు అసెంబ్లీకి రావాలా? సమావేశాల్లో అధికార పార్టీ నేతలు నా గురించి మాట్లాడే యత్నం చేస్తే పట్టించుకోవద్దు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాల పైనే పోరాడాలి. రైతులకు నీరు ఇవ్వకుండా ప్రభుత్వం గోస పెడుతోంది. కృష్ణా, గోదావరి జలాల అంశంపై ఉద్ధృత పోరాటం చేయాలి. రాజకీయాల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారు. పంపులు ఎందుకు ఆన్ చేయడం లేదు? కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుల వద్దకు వెళ్దాం. నియోజకవర్గాల పునర్విభజన కచ్చితంగా జరుగుతుంది" అని కేసీఆర్ అన్నారు.

*** సమావేశాలు నెలరోజులు నిర్వహించేలా ప్రభుత్వంపై ఒత్తిడి: హరీశ్‌రావు**

శాసనసభ, మండలిలో అనుసరించాల్సిన వ్యూహాలపై కేసీఆర్ దిశానిర్దేశం చేశారని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. బీఆర్ఎస్ శాసనసభా పక్ష సమావేశం అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. "కాంగ్రెస్ వెయ్యిరోజుల పాలన పూర్తయింది. అన్నివర్గాలనూ ఈ ప్రభుత్వం మోసం చేసింది. రైతులు, నిరుద్యోగులు, రైతులు, బలహీనవర్గాలు, మహిళలకు తీరని ద్రోహం చేసింది. అసెంబ్లీ సమావేశాలను నెలరోజులపాటు నిర్వహించేలా బీఏసీలో ఒత్తిడి తేవాలని కేసీఆర్ సూచించారు. సభలో మాట్లాడాల్సిన అంశాలపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆయన పలు సూచనలు చేశారు. కాళేశ్వరం, పాలమూరురంగారెడ్డి అంశాలపై నిలదీయాలని చెప్పారు." అని హరీశ్‌రావు తెలిపారు.

## నాపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్‌ను అరెస్ట్ చేయాలి: కవిత

బంజారాహిల్స్: సామాజిక మాధ్యమాల్లో తనపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన చేసిన కానిస్టేబుల్‌ను సర్వీస్ నుంచి రిమూవ్ చేయకుండా రాష్ట్ర డీజీపీ సస్పెండ్‌తోనే సరిపెట్టారని తెలంగాణ రక్షణసేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత (Kavitha) ఆగ్రహం వ్యక్తం చేశారు. అతడిపై కేసు పెట్టి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే చర్యలు చేపట్టకుంటే.. అంతర్జాతీయ వేదికలపై ప్రభుత్వం తీరును ఎండగడతానని హెచ్చరించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణసేన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడారు. మహిళలపై అసభ్యంగా మాట్లాడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు చెబుతున్నాయని, అవి డీజీపీకి తెలియదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి



మూడేళ్లయినా.. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు కల్లలు గానే మిగిలిపోయాయన్నారు. బీసీల కోసం ధర్నాలు చేస్తామని కాంగ్రెస్ నేతలు చెప్పడం పెద్ద జోక్ అని కవిత అన్నారు. 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆక్షేపించారు. మాజీ మంత్రి కొండా సురేఖ అంశం ఆ పార్టీ అంతర్గత విషయమన్నారు.

## అవినీతి, కుంభకోణాలపై అసెంబ్లీ సాక్షిగా నిలదీస్తాం: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని అంశాల్లో విఫలమైందని తెలంగాణ భాజపా శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. అనేక అవినీతి, కుంభకోణాలపై ప్రభుత్వాన్ని అసెంబ్లీ సాక్షిగా నిలదీస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 33 నెలలైనా అమలు చేయలేదని, ఆరు గ్యారంటీలను నెరవేర్చలేదన్నారు. ప్రజా వ్యతిరేకమైన జీవోలపైనా నిలదీస్తామన్నారు. సభను నడపడానికి రాష్ట్ర ప్రభుత్వం భయపడుతుందోన్నారు. అసెంబ్లీ సమావేశాలను 15 రోజుల పాటు నిర్వహించాలని మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు ప్రభుత్వ, పేదల ఆస్తులను దోచుకుంటున్నారని ఆదిలాబాద్



ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆరోపించారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు, దమనకాండపై అసెంబ్లీలో ప్రశ్నిస్తామన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీస్తామని చెప్పారు.

**అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన భాజపా**

తెలంగాణ అసెంబ్లీ ముట్టడికి భాజపా పిలుపునిచ్చింది. ఇందిరాపార్కు వద్ద ధర్నాకు భాజపా శ్రేణులు అనుమతి అడగడంతో ప్రభుత్వం నిరాకరించింది. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో అనుమతులు ఇవ్వలేదు. దీంతో సోమవారం అసెంబ్లీని ముట్టడించాలని శ్రేణులకు ఆ పార్టీ పిలుపునిచ్చింది. విద్యార్థులతో ధర్నా చౌక్ వద్ద మహా ధర్నా చేపడతామని అనుమతి కోరితే ప్రభుత్వం నిరాకరించిందని భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు తెలిపారు. విద్యార్థుల పక్షాన శాంతి యుతంగా ధర్నా చేస్తామని చెబితే ఎందుకు అనుమతి ఇవ్వలేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు.

## పలువురు కాంగ్రెస్ నేతలకు టీపీసీసీ షోకాజ్ నోటీసులు

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరించారంటూ పలువురికి టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆదిలాబాద్ ఇన్‌ఛార్జ్ కంది శ్రీనివాస్‌తో పాటు సంజీవరెడ్డి, జూపల్లి మల్లారెడ్డి, గజ్వేల్ నర్సారెడ్డికి నోటీసులు పంపింది. ఈ మేరకు క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి తెలిపారు. ఎంతటి వారైనా పార్టీ లైన్‌లోనే పనిచేయాలని.. హద్దు మీరి ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు. తాను పొరపాటు చేసినా ఏఐసీసీకి ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేయడం తన డిక్షనరీలోనే లేదని చెప్పారు.

**వాళ్లిద్దరితో ఎలాంటి విభేదాలు లేవు**

మాజీ మంత్రి కొండా సురేఖ, సీనియర్ నేత చిన్నారెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని మల్లు రవి స్పష్టం చేశారు. తాను ఎవరిపైనా కక్షతో నివేదిక ఇవ్వలేదని చెప్పారు. వాళ్లూ తన మిత్రులేనన్నారు. మహిళా మంత్రిగా సీఎంకు



కొండా సురేఖ వచ్చి రాఖీ కట్టారని.. ఆ తర్వాత జరిగిన పరిణామాలు ధర్మం ప్రకారం జరిగినవేనని వ్యాఖ్యానించారు. క్రమశిక్షణ విషయంలో కఠినంగా ఉండాలని పార్టీ ఆదేశించిందని మల్లు రవి చెప్పారు. పార్టీ శ్రేణులు తమ ఫిర్యాదులను గాంధీభవన్‌కి వచ్చి చెప్పుకోవచ్చన్నారు. నకిరేకల్ సభకు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రావడం మంచి పరిణామమన్నారు.

## గ్రామ నిధులు నేరుగా సర్పంచులకే అందేలా త్వరలో కొత్త బిల్లు: మంత్రి సీతక్క

గచ్చిబౌలి: గ్రామ సర్పంచులు నిత్యం ఎదురయ్యే ఒత్తిళ్లు, విమర్శలను తట్టుకొని మానసిక స్థైర్యంతో ముందుకు సాగాలని మంత్రి సీతక్క అన్నారు. నిధుల విడుదల విషయంలో ఉప సర్పంచుల చెక్ పవర్‌కు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో వచ్చిన చట్టంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నారు. ఈ అంశాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు మంత్రి తెలిపారు. గ్రామాలకు అభివృద్ధి నిధులు ఆగిపోకుండా.. నిధులు నేరుగా సర్పంచులకే అందేలా త్వరలో అసెంబ్లీలో కొత్త బిల్లు ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. ఆదివారం గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్‌లో సర్పంచుల కోసం 'సమర్థవంతమైన నాయకత్వం ద్వారా గ్రామ ప్రగతి' అనే అంశంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయడమే కాదు ప్రజల్లో నైతిక విలువలను పెంపొందించే దిశగా సర్పంచులు నాయకత్వం వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 9 రకాల ఆదర్శ గ్రామ అంశాలను సర్పంచులు ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. మానసిక ఆరోగ్యం పరిరక్షణ పట్ల సర్పంచులకు అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాజయోగిని బ్రహ్మకుమారి సంతోష్ దీదీ మాట్లాడుతూ.. సర్పంచులు నిస్వార్థంగా ప్రజాసేవ చేయాలని అన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్,



శాంతి సరోవర్ డైరెక్టర్ కుల్‌దీప్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిపక్ష నేత హోదాకు కేసీఆర్ న్యాయం చేయాలి: మహేశ్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్: ప్రజలు ఇచ్చిన ప్రతిపక్ష నేత హోదాకు మాజీ సీఎం కేసీఆర్ (KCR) న్యాయం చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఎమ్మెల్యే పదవికి కేసీఆర్ రాజీనామా చేయాలంటూ ఇందిరాపార్క్ వద్ద పీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాలో ఆయన మాట్లాడారు. ప్రజలు ప్రతిపక్ష పాత్ర పోషిస్తుంటే.. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. ప్రజా తీర్పును అపహాస్యం చేయొద్దని.. అసెంబ్లీకి రాకపోతే ప్రతిపక్ష నేత పదవిని మరొకరికి



అప్పగించాలని హితవు పలికారు. "నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ ప్రజలు పోరాడి స్వరాష్ట్రం సాధించుకున్నారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక అవి కేవలం కేసీఆర్ కుటుంబానికే దక్కాయి. ఉన్నత చదువులు చదివితే సరిపోదు.. సంస్కారం కూడా ఉండాలని కేటీఆర్ గ్రహించాలి. ఉద్యమకారుల కుటుంబాలకు న్యాయం చేస్తున్నాం. సీఎం రేవంత్‌రెడ్డి కృషితో హైదరాబాద్ రూపురేఖలు మారుతున్నాయి. నగరానికి అనుబంధంగా ఫ్యూచర్‌సిటీ మరో గొప్ప నగరంగా ఎదుగుతోంది. సొంతిల్లు కట్టుకోవాలనే పేదల కల.. పదేళ్లపాటు నెరవేరలేదు. ప్రతి నియోజకవర్గానికీ 2,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నాం. అర్హులైన ప్రతి పేదవాడికీ ఇల్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యం. ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ సంక్షేమాన్ని కొనసాగిస్తున్నాం. ప్రభుత్వ విద్య, వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్నాం" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

## ఎర్రవల్లిలో బీఆర్‌ఎస్‌ఎల్పీ భేటీ.. ఎమ్మెల్యేలకు కేసీఆర్ దిశానిర్దేశం



సిద్దిపేట: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలో ఆ పార్టీ శాసనసభాపక్ష (బీఆర్ఎస్ఎల్పీ) సమావేశం జరుగుతోంది. ఈ సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలతో కేసీఆర్ చర్చిస్తున్నారు. బీఆర్ఎస్ కార్యాచరణపై ఎమ్మెల్యేలకు ఆయన దిశానిర్దేశం చేస్తున్నారు.

## హైదరాబాద్ శివారులో కోడిపందేలు.. 22 మంది అరెస్టు

శంషాబాద్: హైదరాబాద్ నగర శివార్లలో నిర్వహిస్తున్న కోడి పందేలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు పక్కా సమాచారంతో దాడి చేసి 22 మందిని అరెస్టు చేశారు. ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మన్నెగూడ ఆర్టీవో కార్యాలయం వెనుక ఓ పాత పౌల్ట్రీ ఫామ్‌లో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆదిభట్ల పోలీసులతో కలిసి శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో నిందితుల నుంచి రూ.3.60 లక్షలు, 31 పందెం కోళ్లు, 146 కోడి కత్తులు, 20 సెల్‌ఫోన్లు, స్కోర్ నోట్‌బుక్ స్వాధీనం చేసుకున్నారు. 3 కార్లు, 3 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. సీజ్ చేసిన మొత్తం ఆస్తుల విలువ సుమారు రూ.35 లక్షలు ఉంటుందని పోలీసుల అంచనా. పౌల్ట్రీ ఫామ్ నిర్వాహకులు ఇతర ప్రాంతాల నుంచి బెట్టింగ్‌దారులను పిలిపించి, కోడి పందేల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసినట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో ప్రధాన నిర్వాహకుడు, భూమి యజమాని పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కోడి పందేలు, జూదానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

# అమెరికా నుంచి బంగారం ఎందుకు తరలిపోతోంది?

యుద్ధాల అనిశ్చితి కొనసాగుతుండగానే... వివిధ దేశాలు అమెరికా నుంచి బంగారాన్ని తరలిస్తుండటం అంతర్జాతీయంగా చర్చనీయాంశమవుతోంది. గత వారం నెదర్లాండ్స్ ఇప్పటిదాకా తాను అమెరికాలో దాచుకున్న బంగారాన్ని లండన్‌కు బదిలీ చేయటం తాజా పరిణామం. కారణమేంటంటే... 'సంక్లిష్ట సంక్షోభానికి ముందస్తు తయారీ' అంటూ నెదర్లాండ్స్ బదులివ్వటం ఆసక్తికరం! ఇంతకూ ఏం జరుగుతోంది? ఎందుకని అమెరికా నుంచి బంగారాన్ని వివిధ దేశాలు తరలిస్తున్నాయి? నెదర్లాండ్స్ ఒక్కటే కాదు... కొద్దికాలం ముందు ఫ్రాన్స్, జర్మనీ తదితర దేశాల కేంద్ర బ్యాంకులు కూడా ఎన్నాళ్లుగానో అమెరికాలో భద్రపరుచుకున్న టన్నుల కొద్దీ బంగారాన్ని తరలించాయి. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఐరోపా దేశాలు ఈ నిర్ణయం తీసుకోవడానికి గల కారణాలను నిపుణులు విశ్లేషిస్తున్నారు. సమీప భవిష్యత్తులో ఏదైనా తీవ్రమైన ఆర్థిక కుదుపును ఈ దేశాలు ఊహిస్తున్నాయా అనే సందేహమూ కలుగుతోంది. యుద్ధాలు జరుగుతున్నప్పుడు, వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు నెలకొన్నప్పుడు అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక ఒడుదుడుకులను తట్టుకోవడానికి బంగారాన్ని విక్రయించడం, తనఖాపెట్టడం వంటి చర్యలను వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు అనుసరిస్తుంటాయి. ద్రవ్యలభ్యతను పెంచుకొని ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కడానికి కూడా ఇది దోహదపడుతుంది. అయితే నెదర్లాండ్స్ చెప్పినట్లు... సంక్లిష్ట ఆర్థిక సంక్షోభం వస్తుందా అనే ప్రశ్నకు ఇప్పటికిప్పుడు అలాంటి పరిస్థితులు లేవన్నదే నిపుణుల మాట. అయినా ... ప్రస్తుత ప్రపంచ భౌగోళిక, రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ఆయా దేశాలు ముందు జాగ్రత్త పడుతున్నాయన్నది



మాత్రం స్పష్టమవుతోంది. వివిధ దేశాల్లోని సాయుధ ఘర్షణలు ముఖ్యంగా రష్యా-ఉక్రెయిన్, అమెరికా-ఇరాన్ యుద్ధాలు ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణాన్ని తీవ్రతరం చేస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని దేశాలపైనా వాణిజ్య సుంకాలను విధిస్తుండడంతో ఆర్థికపరమైన అనిశ్చితీ సర్వత్రా తలెత్తుతోంది. చిరకాల మిత్ర దేశం, పొరుగునున్న కెనడాపై కూడా ట్రంప్ కాలుదువ్వుతున్న పరిస్థితుల్లో.. అమెరికాలో ప్రచ్ఛన్న యుద్ధ కాలం నుంచి నిల్వ చేసిన బంగారంపై ఐరోపా దేశాలు వ్యూహాలను మార్చుకుంటున్నాయి. సుదూరంగా కాకుండా తమకు దగ్గర్లోకి తమ బంగారాన్ని చేర్చుకుంటున్నాయి. అందుకే... అమెరికా, కెనడాలలో నిల్వ చేసిన 313 టన్నుల బంగారంలో సుమారు 86 టన్నులను నెదర్లాండ్స్ లండన్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ ఖజానాకు చేర్చింది. న్యూయార్క్ నుంచి 111 టన్నుల బంగారాన్ని తరలించినట్లు జర్మనీకి చెందిన బుందెష్‌బ్యాంక్ కొన్ని నెలల క్రితం వెల్లడించింది. ఫ్రాన్స్ నుంచి కూడా ఇటువంటి ప్రకటనే వెలువడింది. ఇవన్నీ లండన్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు ఆ మొత్తాన్ని తరలించడం గమనార్హం. బంగారం నిల్వలకు ప్రపంచంలోనే అత్యంత సురక్షిత స్థావరంగా లండన్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు శతాబ్దాలుగా పేరుంది. సెంట్రల్ లండన్‌లో కట్టుదిట్టమైన భద్రత కలిగిన భారీ నేలమాళిగలు దీనికి ఉన్నాయి. ఇక్కడ నిల్వచేసుకున్న బంగారాన్ని మరో చోటుకు తరలించాల్సిన అవసరం లేకుండానే ఏ క్షణంలోనైనా విక్రయించుకోవచ్చు. కేవలం ఖాతాలో సర్దుబాటుతో బంగారాన్ని కొనుగోలు చేయవచ్చు. విక్రయించవచ్చు. బంగారం క్రయవిక్రయాలకు లండన్ అన్నివిధాలా అత్యుత్తమమైన ప్రదేశమని వివిధ దేశాలు భావిస్తున్నందునే అమెరికా నుంచి వ్యూహాత్మకంగా నిల్వలను తరలిస్తున్నాయి. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ ఖజానాలో 5వేల టన్నుల వరకు బంగారాన్ని నిల్వ చేసే సదుపాయం ఉందని సమాచారం.

## 'డాక్టర్ గాడ్'పై ఆసుపత్రిలో దాడి

ఉత్తర్‌ప్రదేశ్‌లో ప్రముఖ విశ్రాంత వైద్యుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత టీకే లహరిపై దాడి జరిగింది. వారణాసిలోని ఓ ఆసుపత్రిలో కొంతకాలంగా చికిత్స పొందుతున్న ఆయనపై ఓ అసోసియేట్ ప్రొఫెసర్ దాడి చేసినట్లు సమాచారం. కాగా, ఈ ఘటనపై విచారణ జరిపేందుకు మెడికల్ బోర్డును ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. డాక్టర్ గాడ్‌గా పేరొందిన ప్రొఫెసర్ లహరి.. హృదయ సంబంధిత సమస్యతో కొన్ని నెలల క్రితం బనారస్ హిందూ యూనివర్సిటీకి అనుబంధంగా పనిచేసే సర్ సుందర్‌లాల్ ఆసుపత్రిలో



చేరారు. ఈ క్రమంలో డాక్టర్ లహరిపై అసోసియేట్ ప్రొఫెసర్ అర్వింద్ పాండే దాడి చేశాడని, దాంతో లహరి ముఖానికి గాయాలయ్యాయని ఆసుపత్రి యాజమాన్యానికి ప్రొఫెసర్ కుటుంబ సభ్యులు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు స్పందిస్తూ.. విచారణ నివేదికలోని ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. బనారస్ హిందూ యూనివర్సిటీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో సుదీర్ఘ కాలం పాటు సేవలందించిన ప్రొ. లహరి 2003లో పదవీ విరమణ చేశారు. ఆ తర్వాత ప్రజలకు ఉచితంగా వైద్యం అందించడంలో నిమగ్నమయ్యారు. పెన్షన్ మొత్తాన్ని స్వచ్ఛంద సంస్థలకే విరాళంగా ఇస్తున్నారు. దీంతో స్థానికంగా 'డాక్టర్ గాడ్'గా పేరు తెచ్చుకున్నారు. సమాజం, వైద్య వృత్తిలో ఆయన చేసిన సేవలకు గాను 2006లో కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ అవార్డు ఇచ్చి సత్కరించింది.

## 35 ఏళ్ల తర్వాత.. 'సర్'తో కలిసిన సోదరులు

ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. మూడున్నర దశాబ్దాల క్రితం దూరమైన తన సోదరుడు 'సర్' సందర్భంగా మళ్లీ ఒక్కటి కావడంతో వారి కుటుంబంలో ఆనందం వెల్లువిరిసింది. హరియాణాలోని జింద్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. పంజాబ్‌లో ప్రస్తుతం 'సర్' ప్రక్రియ కొనసాగుతోంది. ఈ క్రమంలో అమృత్‌సర్‌కు చెందిన సీతారాం (55)కు ఎన్నికల అధికారులకు ఇచ్చేందుకు ఓ ధ్రువీకరణ పత్రం అవసరమైంది. దీంతో స్కూలు టీసీ కోసం హరియాణా జింద్ జిల్లాలోని మనోహర్‌పూర్‌లో



ఆయన చదువుకున్న పాఠశాలకు వెళ్లారు. అక్కడే ఉన్న పోలింగ్ అధికారులు సీతారాం కుటుంబీకుల గురించి ఆరా తీయగా.. తన సోదరుడి పేరు దల్బీర్ అని చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక బూత్ స్థాయి అధికారి (BLO).. దల్బీర్‌కు ఫోన్‌లో తెలియజేశారు. ఎన్నో ఏళ్లుగా ఆచూకీ లేకుండా పోయిన సోదరుడు వచ్చాడని తెలుసుకొని వెంటనే దల్బీర్ పాఠశాలకు వచ్చారు. తమ్ముడిని చూసి ఆనందంలో మునిగిపోయారు. ఇద్దరు సోదరులు ఆలింగనం చేసుకొని కన్నీటిపర్యంతమయ్యారు. పోలియోతో బాధపడుతున్న సీతారాంను 35 ఏళ్ల క్రితం సమీపంలోని ఓ ఆసుపత్రిలో కుటుంబీకులు చేర్పించారు. నెల రోజుల చికిత్స అనంతరం వచ్చే చూసేసరికి సీతారాం అక్కడ కనిపించలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. చివరకు సీతారాం తిరిగి రాకపోవచ్చని ఆశలు వదులుకున్నారు. అయితే, కుటుంబానికి భారం కావద్దనే ఉద్దేశంతో అక్కడ నుంచి వెళ్లిపోయానని అధికారులకు సీతారాం వెల్లడించారు. పంజాబ్‌కు వెళ్లి అక్కడ కొంతకాలం ఓ ప్రైవేటు పాఠశాలలో ప్యూన్‌గా పనిచేశానని, ఆ తర్వాత ప్రభుత్వ ఉద్యోగం సంపాదించినట్లు చెప్పారు.

## కల్తీ మద్యం తాగి 9 మంది మృతి

మధ్యప్రదేశ్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కల్తీ మద్యం తాగి 9 మంది మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. సాగర్ జిల్లాలోని నాలుగు గ్రామాల్లో శనివారం రాత్రి మద్యం తాగిన పలువురు అస్వస్థతకు గురయ్యారు. తీవ్ర వాంతులు, ఇతర అనారోగ్య లక్షణాలు కనబడటంతో వారి కుటుంబీకులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ ఇప్పటి వరకు 9 మంది మృతిచెందారు. 30 మందికిపైగా చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని పేర్కొన్నారు. ఈ ఘటనతో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. అధికారులు వెంటనే స్పందించి వైద్యబృందాలను రంగంలోకి దించారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి అనారోగ్యానికి గురైన వారిని గుర్తిస్తున్నారు. అస్వస్థతగా ఉన్నవారిని



మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలిస్తున్నారు. మద్యంలో విషపూరిత రసాయనం కలిసిందా? అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. స్థానికంగా విక్రయించిన మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకుని పరీక్షలకు పంపారు. ఈ ఘటనపై విచారణకు జిల్లా యంత్రాంగం ఆదేశించింది. ఆయా ప్రాంతాల్లో గత 24 నుంచి 48 గంటల్లో మద్యం తాగిన వారు.. అనారోగ్య లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్య పరీక్షలు చేయించుకోవాలని అధికారులు సూచించారు.

## కొత్త మ్యాప్‌నకు కొంత వరకే మద్దతు..వాటిని అంగీకరించం: భారత్

వివిధ దేశాలు, ఖండాల వైశాల్యాన్ని కచ్చితంగా చూపే సరికొత్త 'ఈక్వల్ ఏరియా మ్యాప్' (నిజ వైశాల్య ప్రపంచ పటం) వినియోగంపై ఐక్యరాజ్య సమితి చేసిన తీర్మానానికి భారత్ మద్దతు తెలిపింది. అయితే ఈ మద్దతు ప్రపంచ పటంలో ఏ నిర్దిష్ట మార్పులకు గానీ.. జాతీయ సరిహద్దుల చిత్రణకు గానీ ఆమోదం తెలిపినట్లు కాదని స్పష్టం చేసింది. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జయస్వాల్ మాట్లాడుతూ.. 'ఐక్యరాజ్య సమితి చేసిన ఈ తీర్మానానికి భారత్ అనుకూలంగా ఓటు వేసింది. ఓటు వేసినందుకు గల కారణాలను కూడా వివరించింది. ఈ మద్దతు అంతర్జాతీయ సరిహద్దులు, వివాదాస్పద భూభాగాలు లేదా ప్రదేశాల పేర్లతో సహా రాజకీయ ఉద్దేశాలతో మార్పులు చేసిన పటాల గురించి ప్రస్తావించదు. అంతే కాకుండా ఈ పటంలో జమ్మూ కశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలతో సహా సార్వభౌమ భూభాగాలను భారతదేశ అధికారిక పటం ప్రకారమే చూపించాలి. అందుకు విరుద్ధంగా తప్పుదారి పట్టించే విధంగా చూపించే ఏ చిత్రీకరణ అయినా ఆమోదయోగ్యం కాదు. సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతపై భారతదేశ వైఖరి స్పష్టంగా ఉంటుంది. ఈ విషయంలో రాజీ పడే అవకాశమే లేదు' అని జయస్వాల్ స్పష్టం చేశారు.

**కొత్త ప్రపంచ పటం..**

వివిధ దేశాలు, ఖండాల వైశాల్యాన్ని కచ్చితంగా చూపే సరికొత్త 'ఈక్వల్ ఏరియా మ్యాప్'ను (నిజ వైశాల్య ప్రపంచ పటం) ఐక్యరాజ్య సమితి ఆమోదించింది. దీంతో 16వ శతాబ్దం నుంచి అమల్లో ఉన్న మర్కేట ప్రపంచ పటం కనుమరుగు కానుంది. కొత్త పటంలో భారత్,



ఆఫ్రికాలు పెద్దగా కనిపిస్తాయి. అమెరికా కొంత చిన్నదిగా కనిపించనుంది. పటంలో మాత్రమే ఈ మార్పులు కనిపిస్తాయి. దేశాల వాస్తవ సరిహద్దుల్లో ఎటువంటి మార్పులు ఉండవు. 16వ శతాబ్దంలో నౌకాయానం కోసం రూపొందించిన పాత మర్కేట పటాన్ని ఐరాస కాలం చెల్లినదిగా ప్రకటించింది. దీంతో ప్రపంచ పటాన్ని మరింత కచ్చితంగా చూపే కొత్త పటాన్ని ప్రామాణికంగా ప్రకటిస్తూ తీర్మానం ప్రవేశపెట్టింది.

## అంత్యక్రియలు ముగిసిన 15 రోజులకు.. బతికున్నాడంటూ కాల్

పంజాబ్‌లోని కపుర్తలాలో ఓ ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఇటీవల తమ కుమారుడు కనిపించకుండా పోయాడని ఫిర్యాదు చేసిన ఓ కుటుంబానికి స్థానిక పోలీసులు ఓ మృతదేహాన్ని అప్పగించారు. అది తమ కుమారుడే అని భావించిన ఆ కుటుంబసభ్యులు అంత్యక్రియలు చేశారు. చనిపోయాడనుకున్న కుమారుడు.. బతికే ఉన్నాడని 15 రోజుల తర్వాత పోలీసుల నుంచి ఫోన్ రావడంతో ఆశ్చర్యపోయారు. పంజాబ్‌లోని కపుర్తలా గ్రామానికి చెందిన రవి కుమార్ ఆగస్టు 5న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా అతడి ఆచూకీ తెలియకపోవడంతో ఆగస్టు 11న కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న అధికారులు అతడి కోసం గాలిస్తుండగా.. కాలిపోయిన స్థితిలో ఓ యువకుడి మృతదేహం లభ్యమైంది. దీంతో పోలీసులు రవికుమార్ కుటుంబసభ్యులకు దానిని సమాచారం ఇచ్చారు. ఆ మృతదేహం తమ కుమారుడిదేనని అతడి తల్లిదండ్రులు గుర్తించడంతో వారికి అప్పగించారు. ఆగస్టు 13న మృతదేహానికి అంత్యక్రియలు



నిర్వహించారు. సెప్టెంబర్ 2న కపుర్తలా సెంట్రల్ జైలు పోలీసుల నుంచి రవికుమార్ కుటుంబానికి ఫోన్ కాల్ వచ్చింది. అతడు చనిపోలేదని.. అనుమానాస్పదంగా సంచరిస్తున్న కేసులో నెల రోజుల క్రితం జలంధర్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలపడంతో కుటుంబసభ్యులు ఆశ్చర్యపోయారు. జైలుకు వెళ్లిన కుటుంబసభ్యులు అక్కడ రవికుమార్‌ను చూసి ఆనందం వ్యక్తం చేశారు. చనిపోయాడనుకున్న తమ కుమారుడు మళ్లీ రావడంతో ఆనందంతో కన్నీరుపెట్టుకున్నారు. అయితే, అంత్యక్రియలు నిర్వహించిన ఆ మృతదేహం ఎవరిదనే కోణంలో పోలీసులు ఇప్పుడు దర్యాప్తు చేపట్టారు.

## డ్రగ్స్ కేసు.. మహిళా టీవీ యాంకర్‌కు మరణశిక్ష

మాదకద్రవ్యాల అక్రమ రవాణా కేసులో ఈజిప్టుకు చెందిన న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. స్థానిక టీవీ వ్యాఖ్యాత సారా ఖలీఫా (39) సహా 12 మందికి మరణశిక్ష విధించింది. మరో తొమ్మిది మంది దోషులకు జీవిత ఖైదు విధించగా.. ఏడుగురిని నిర్దోషులుగా ప్రకటించింది. నిందితులు విదేశాల నుంచి ముడిపదార్థాలను దిగుమతి చేసుకోవడం, స్థానికంగా సింథటిక్ డ్రగ్స్ తయారు చేయడం, వాటిని విక్రయించడం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో అధికారులు గుర్తించారు. గతేడాది దాడుల్లో 750 కిలోలకుపైగా మాదక ద్రవ్యాలు, ముడి పదార్థాలు, లైసెన్స్ లేని ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో భాగంగా గతేడాది ఏప్రిల్‌లోనే సారాను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. అయితే, తనపై వచ్చిన ఆరోపణలను ఆమె ఖండించారు. తాను ఎన్నడూ డ్రగ్స్ వాడలేదని, కనీసం సిగరెట్ కూడా తాగలేదని



విచారణ సందర్భంగా కోర్టులో విలపించినట్లు స్థానిక మీడియా పేర్కొంది. తాజాగా మరణశిక్ష పడడంతో.. తీర్పుపై అప్పీలుకు వెళ్తామని ఆమె తరఫు న్యాయవాది వెల్లడించారు.

**ఎవరీ సారా..?**

ఈజిప్టుకు చెందిన సారా ఖలీఫా స్థానికంగా టెలివిజన్ ప్రజెంటర్‌గా గుర్తింపు పొందారు. నేరాలు, భద్రత సంబంధిత అంశాలతో కూడిన 'మిషన్ ఇంపాజిబుల్' అనే కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. కాస్మెటిక్ సర్జరీ క్లినిక్‌తోపాటు ఈవెంట్‌లు, పార్టీలు నిర్వహించే ప్రొడక్షన్ కంపెనీ కూడా ఉన్నట్లు సమాచారం. సోషల్ మీడియాలో క్రియాశీలంగా ఉండే ఆమెకు ఇన్‌స్టాలో 25లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. ఈజిప్టులో ఉగ్రవాదం, హత్య, అత్యాచారం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి నేరాల్లో మరణశిక్ష అమలు అవుతోంది. అయితే, డ్రగ్స్ కేసుల్లో మరణదండన విధించడాన్ని అక్కడి మానవ హక్కుల సంఘాలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. ఇదిలాఉంటే, అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ నివేదిక ప్రకారం.. 2025లోనే ఈజిప్టు 492 మరణశిక్షలు విధించగా, వాటిలో 23 అమలు చేసింది.

## భారత పర్యాటకులను ఆకర్షిస్తున్న ఒమన్

ఒమన్ భారత పర్యాటకులను ఆకర్షిస్తోంది. గతేడాది 6.94 లక్షల మంది భారతీయ పర్యాటకులు ఆ దేశాన్ని సందర్శించారు. 2024తో పోలిస్తే ఇది 11 శాతం పెరిగిందని ఆ దేశ హెరిటేజ్ అండ్ టూరిజం మంత్రిత్వ శాఖకు చెందిన ఓ సీనియర్ అధికారి తెలిపారు. ఈ వృద్ధి రెండు దేశాల మధ్య పర్యాటక సంబంధాలను మరింత బలపరుస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి జూన్ మధ్య 3.81 లక్షల మంది భారతీయులు ఒమన్ సందర్శించారు. మస్కట్, నిజ్వా కోట వంటి ప్రసిద్ధ ప్రాంతాలు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయని సదరు అధికారి తెలిపారు. సాధారణ విహారయాత్రలతో పాటు అడ్వెంచర్, డెస్టినేషన్ వెడ్డింగ్స్, సమావేశాలు, ఎగ్జిబిషన్ వంటి వాటికి ఒమన్ ప్రత్యేక ఎంపికగా మారిందన్నారు. భారత్‌లోని 10 కంటే ఎక్కువ నగరాల నుంచి ఆ దేశానికి నేరుగా విమాన సర్వీసులు నడవడమే ఇందుకు ఓ కారణమని అన్నారు.




## జేఎన్‌యూ ప్రొఫెసర్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు..!

ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చాయి. ఈ మేరకు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఓ ప్రొఫెసర్ తమతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని..యూనివర్సిటీకి చెందిన 10మంది విద్యార్థినులు నెల రోజుల క్రితం యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. క్యాంపస్‌లోని ఆయన నివాసంలో జరిగే సమావేశాలకు ఆహ్వానించి.. ఎవరూ లేని సమయంలో తమతో అసభ్యకరంగా ప్రవర్తించేవారని పేర్కొన్నారు. తరగతుల సమయంలో కూడా అసభ్యకరంగా మాట్లాడుతుంటారని తెలిపారు. తాము కూడా సదరు ప్రొఫెసర్‌తో అటువంటి సమస్యలే ఎదుర్కొన్నట్లు పలువురు సీనియర్ విద్యార్థులు ఫిర్యాదు చేశారు. దీంతో విద్యార్థినుల ఆరోపణలపై విశ్వవిద్యాలయం



అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ICC) దర్యాప్తు చేపట్టింది. అయితే ఈ విషయంపై జేఎన్‌యూ పరిపాలన విభాగం, వైస్‌ఛాన్సలర్ కార్యాలయం ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.




## ఎస్‌బీఐలో కొత్తగా 12 వేల నియామకాలు!




ప్రభుత్వ రంగానికి చెందిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన సేవలను మరింత విస్తరించనుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 12 వేల నియామకాలతో పాటు, కొత్తగా 250 బ్రాంచ్‌లను ప్రారంభించనున్నట్లు ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి తెలిపారు. ఈ ఏడాదే 11-12 వేల వరకు కొత్త నియామకాలు చేపట్టే ప్రణాళికలు ఉన్నాయని ఎస్‌బీఐ ఛైర్మన్ సీఎస్ శెట్టి వెల్లడించారు. ముఖ్యంగా క్లరికల్, ఆఫీసర్ కేడర్లలో ఇవి ఉంటాయన్నారు. ఉద్యోగుల రిటైర్మెంట్, బ్యాంక్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌బీఐకి అత్యంత భారీ నెట్‌వర్క్ ఉందని, బ్యాంక్ సేవలను మరింత విస్తరించేందుకు కొత్తగా 200-250 బ్రాంచ్‌లను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. మార్చి 2026 నాటికి ఎస్‌బీఐలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 2.45 లక్షలు దాటింది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ బ్యాంక్ మొత్తం 25,633 మందిని రిక్రూట్ చేసుకుంది. మరోవైపు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రతిపాదిస్తున్న రూ.30వేల కోట్ల ఐపీఓ (IPO)లో ఎస్‌బీఐ, దాని అనుబంధ సంస్థ ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్ సంయుక్తంగా 1 శాతం వాటాను విక్రయించనున్నాయి.

## 'పసిడి' రుణాల జోరు!

* **2028 నాటికి రూ.30 లక్షల కోట్లకు**

హైదరాబాద్: దేశ వ్యాప్తంగా బంగారు రుణాల మార్కెట్ శరవేగంగా విస్తరిస్తోంది. ఒకప్పుడు ఆర్థిక ఇబ్బందుల్లో చివరి ప్రత్యామ్నాయంగా నిలిచిన ఈ రుణాలు, ఇప్పుడు రిటెయిల్ ఆస్తుల విభాగంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్నాయి. మోతీలాల్ ఓస్వాల్ నివేదిక అంచనా ప్రకారం.. 28 శాతం వార్షిక వృద్ధి రేటుతో ఈ రంగం 2028 మార్చి నాటికి రూ.30 లక్షల కోట్ల మైలురాయిని అధిగమించనుంది. 2026 మార్చి నాటికి రూ.18.6 లక్షల కోట్లుగా ఉన్న ఈ మార్కెట్ పరిణామం, గృహ రుణాల తర్వాతి స్థానాన్ని ఆక్రమిస్తూ, రెండో అతిపెద్ద రిటెయిల్ ఆస్తి విభాగంగా నిలిచింది. వ్యక్తిగత రుణాల పోర్ట్‌ఫోలియోనూ ఇది అధిగమించడం విశేషం. 2026 ఆర్థిక సంవత్సరంలో నమోదైన 50 శాతం వృద్ధికి పసిడి ధరలు 60 శాతం మేర పెరగడమూ ప్రధాన కారణం. భారతీయ కుటుంబాల దగ్గరున్న బంగారు నిల్వలే ఈ భారీ వృద్ధికి దోహదం చేస్తున్నాయి.

**ఇళ్లల్లోనే 28,000 టన్నుల పసిడి**

ఇళ్లల్లో ఉన్న పసిడి నిల్వలు దేశ రుణ లభ్యతను పెంచే వ్యూహాత్మక వనరులుగా మారుతున్నాయి. దేశంలోని కుటుంబాల వద్ద సుమారు 28,000 టన్నుల బంగారం ఉన్నట్లు అంచనా. దీని విలువ రూ.380390 లక్షల కోట్ల మధ్య ఉంటుంది. ఈ భారీ నిల్వలో కేవలం 8 శాతం మాత్రమే వ్యవస్థీకృత మార్కెట్ పరిధిలోకి రావడం గమనార్హం. ఇదీ ఈ రంగానికి ఉన్న విస్తృత అవకాశాలను చాటుతోంది. ముఖ్యంగా ఎంఎస్ఎంఈ సంస్థలు, అసంఘటిత రంగాలు తమ నిర్వహణ మూలధనం కోసం పసిడి రుణాలను ఎక్కువగా ఆశ్రయిస్తున్నాయి. మైక్రోఫైనాన్స్ వినియోగదారులు పొందే ఇతర రిటెయిల్ రుణాల్లో బంగారు రుణాల వాటా 18 శాతానికి చేరడం గమనార్హం.



**పాత రుణగ్రహీతలే ఎక్కువగా..**

బంగారం రుణాల్లో మరో ఆసక్తికరమైన విషయమూ ఉంది. కొత్త రుణగ్రహీతలకంటే, పాత ఖాతాదారులే పదే పదే రుణాలు తీసుకోవడం మార్కెట్ సుస్థిరతపై సందేహాలను రేకెత్తిస్తోంది. ప్రస్తుత వృద్ధి కేవలం బంగారం ధరల పెరుగుదలపైనే ఆధారపడి ఉంటుంది తప్ప వినియోగదారుల సంఖ్యలో పురోగతి కనిపించడం లేదు. ముత్తూట్ ఫైనాన్స్, మణప్పురం ఫైనాన్స్ వంటి బంగారు రుణ సంస్థలూ ఇదే విషయాన్ని పేర్కొంటున్నాయి. ఈ రెండు సంస్థల ఉమ్మడి ఖాతాదారుల సంఖ్య 90 లక్షల వద్ద, బంగారం నిల్వలు 260265 టన్నుల వద్దే ఉన్నాయి. పోర్ట్‌ఫోలియో విలువ పెరిగినా, వినియోగదారుల బలం విస్తరించకపోవడం పరిశ్రమ ఎదుర్కొంటున్న ప్రధాన సవాలు. 2022లో 75 శాతంగా ఉన్న పాత రుణాల పునరుద్ధరణ వాటా 2025 నాటికి 82 శాతానికి చేరడం వ్యవస్థాగత నష్టభయాన్ని సూచిస్తోంది. ఇది రుణ గ్రహీతలు మరింత అప్పుల ఊబిలోకి కూరుకుపోయే ప్రమాదాన్ని వెల్లడిస్తోంది.

**దేశవ్యాప్తంగా...**

ఒకప్పుడు దక్షిణాది రాష్ట్రాలకే ఎక్కువగా పరిమితమైన బంగారు రుణాల వ్యాపారం ఇప్పుడు దేశ వ్యాప్తంగా విస్తరిస్తోంది. దేశవ్యాప్త సగటు వృద్ధి 50 శాతంగా ఉంటే, రాజస్థాన్‌లో 78 శాతం, మహారాష్ట్రలో 61 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 58 శాతం వృద్ధి నమోదైంది. ఈ భౌగోళిక విస్తరణ పసిడి రుణ రంగంలో సరికొత్త పోటీకి ఆస్కారం ఇస్తోంది..

**నిబంధనలు కఠినంగా..**

పసిడి రుణ మార్కెట్‌లో నెలకొన్న ఈ పరిస్థితిని గమనిస్తున్న నియంత్రణ సంస్థలు నిబంధనలను ఎప్పటికప్పుడు కఠినతరం చేస్తున్నాయి. మార్కెట్ అదుపు తప్పకుండా చూసేందుకు ఆర్‌బీఐ పర్యవేక్షణ పెంచింది. విలువ ఆధారిత రుణం (ఎల్‌టీవీ) లెక్కింపు విధానం, రుణాల కాలపరిమితి, రుణ గ్రహీతల అర్హత ప్రమాణాలతో పాటు రుణ నిర్వహణపైనా కఠిన ఆదేశాలు జారీ చేసింది. బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల మధ్య నిబంధనల సమన్వయం వల్ల అనారోగ్యకరమైన పోటీకి అడ్డుకట్ట వేయాలని ఆర్‌బీఐ భావిస్తోంది.

**పోటీ పడుతున్న సంస్థలు**

ఈ రంగంలోని లాభాలను అందుకోవడానికి ప్రైవేట్ బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ) సంస్థలు దూకుడు ప్రదర్శిస్తున్నాయి. బజాజ్ ఫైనాన్స్ బంగారం రుణాల విభాగం గత మూడేళ్లలో 86 శాతం వార్షిక వృద్ధి రేటును నమోదు చేస్తూ, 2026 జూన్ త్రైమాసికం నాటికి రూ.21,000 కోట్లకు చేరింది. 2027 మార్చి నాటికి రూ.30,000 కోట్ల లక్ష్యాన్ని చేరుకోవాలని ఆ సంస్థ భావిస్తోంది. ఈ తీవ్ర పోటీ వల్ల కేవలం పసిడి రుణాలపైనే దృష్టి సారించే సంస్థలపై ఒత్తిడి పెరుగుతోంది

## జేఎల్ఆర్‌లో 4,000 ఉద్యోగాల కోత

లండన్: టాటా మోటార్స్ అనుబంధ లగ్జరీ కార్ల తయారీ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జేఎల్ఆర్) యూకేలోని తన విభాగాల్లో వచ్చే రెండేళ్లలో సుమారు 4,000 మంది ఉద్యోగులను తగ్గించాలని యోచిస్తోంది. అంతర్జాతీయంగా తగ్గుతున్న అమ్మకాలు, పెరుగుతున్న ఖర్చులు, అమెరికా విధిస్తున్న కొత్త వాణిజ్య సుంకాల ప్రభావం వల్ల ఈ నిర్ణయం తీసుకోక తప్పడం లేదని సమాచారం. ఖర్చులను తగ్గించుకుని సంస్థను మరింత సమర్థవంతంగా నడపంలో భాగంగా ఉద్యోగుల కోసం కంపెనీ స్వచ్ఛంద విరమణ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. జేఎల్ఆర్ ఉద్యోగాల కోత ద్వారా వచ్చే రెండేళ్లలో సుమారు 1.7 బిలియన్ పౌండ్ల (సుమారు రూ.17,000 కోట్లకు పైగా) వ్యయాలను తగ్గించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం జేఎల్ఆర్‌కు బ్రిటన్ వ్యాప్తంగా మూడు ప్రధాన ప్లాంట్లలో సుమారు 34,000 మంది ఉద్యోగులు ఉన్నారు. తాజా ఉద్యోగాల కోత ఆఫీస్, మేనేజ్‌మెంట్ సిబ్బందికే వర్తించనుందని తెలుస్తోంది.

* **భారత్‌లో ఫోక్స్‌వ్యాగన్ కోత ప్రభావం తక్కువే**

జర్మనీకి చెందిన ప్రముఖ కార్ల తయారీ సంస్థ ఫోక్స్ వ్యాగన్ మన దేశంలో వచ్చే రెండేళ్లలో 12 శాతం మంది ఉద్యోగులను తొలగించాలని యోచిస్తోంది. ఇక్కడ సంస్థకు 2300 2700 వరకు ఉద్యోగులున్నారు. ఆ లెక్కన ప్రభావం వందల సంఖ్యలోనే ఉండనుంది. అంతర్జాతీయ స్థాయిలో 50,000 మందికి ఉద్వాసన పలికే ప్రక్రియను ప్రారంభించిన ఈ సంస్థ, 2030 నాటికి మరో 50,000 ఉద్యోగాలను తగ్గించాలని, జర్మనీలోని కొన్ని ప్లాంట్లను మూసివేయాలని నిర్ణయించింది.



అయితే భారత్‌ను ఒక ముఖ్యమైన తయారీ, ఎగుమతి కేంద్రంగా కొనసాగిస్తామని, ఇక్కడి ఇంజినీరింగ్ బృందాన్ని మరింతగా విస్తరిస్తామని కంపెనీ స్పష్టం చేసింది.




## 'ఆ ఒక్క విజయం.. పాక్ క్రికెట్ పతనం ప్రారంభం'!




పాకిస్థాన్ క్రికెట్ జట్టు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సంక్షోభానికి ఆ జట్టు మాజీ కెప్టెన్ మహ్మద్ యూసుఫ్ ఒక విచిత్రమైన కారణాన్ని చూపాడు. దుబాయ్‌లో జరిగిన 2021 ఐసీసీ టీ20 ప్రపంచ కప్ (T20 WC 2021)లో భారత్‌పై పాకిస్థాన్ 10 వికెట్ల తేడాతో గెలిచిన తర్వాత తమ జట్టు పతనం మొదలైందని అభిప్రాయపడ్డాడు. ఆ విజయం తర్వాత కొంతమంది ఆటగాళ్లు తాము ఏదో గొప్ప విజయం సాధించామని విర్రవీగారని, కెప్టెన్సీ కోసం నెలకొన్న పోటీ డ్రెస్సింగ్ రూమ్‌లో విభేదాలను సృష్టించిందని పేర్కొన్నాడు. "2021లో భారత్‌పై మేం గెలిచాం. ఆ మ్యాచ్ మాకు చాలా నష్టం కలిగించింది. ఎందుకంటే ఆ విజయం తర్వాత, తాము ఏదో గొప్ప విజయాన్ని సాధించామని కొందరు ఆటగాళ్లు భావించడం మొదలుపెట్టారు. ఆ తర్వాత ఏం చేయాలో వారికి అర్థం కాలేదు. మంచి ప్రదర్శన చేస్తున్నప్పుడు వినయంగా ఉండాలి. అహంకారంతో ప్రవర్తిస్తూ అగౌరవంగా వ్యవహరిస్తే సమస్యలు వస్తాయి. పాకిస్థాన్ క్రికెట్‌లో అటువంటి సమస్యలు చాలానే తలెత్తాయి. జట్టులోని ప్రతి ఒక్కరూ కెప్టెన్ కావాలని ప్రయత్నించారు. దాని పర్యవసానాలు ఇప్పటికీ పాకిస్థాన్ క్రికెట్‌కు నష్టం కలిగిస్తున్నాయి. భారత్‌పై విజయం తర్వాత వన్డే, టీ20 ప్రపంచ కప్‌లు, ఆసియా కప్‌లు, ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో పాక్ చెత్త ప్రదర్శన చేసింది. జట్టు నుంచి మంచి ఫలితాలు రాబట్టడానికి పీసీబీ ఎన్నో ప్రయత్నాలు చేసింది. కెప్టెన్లు, కోచ్‌లు, సహాయక సిబ్బందిని మార్చింది. అయినా ఏ ఆటగాడూ ముందుకు వచ్చి బాధ్యత తీసుకోలేదు" అని మహ్మద్ యూసుఫ్ పేర్కొన్నాడు. 2021 టీ20 ప్రపంచ కప్‌లో టీమ్ఇండియా తో జరిగిన మ్యాచ్‌లో 152 పరుగుల లక్ష్యాన్ని పాక్ ఒక్క వికెట్ నష్టపోకుండా ఛేదించింది. ఓపెనర్లు బాబర్ అజామ్ (68*), మహ్మద్ రిజ్వాన్ (79*) నాటౌట్‌గా నిలిచి జట్టుకు ఘన విజయం అందించిన విషయం తెలిసిందే. పొట్టి వరల్డ్ కప్ చరిత్రలో భారత్‌పై పాక్ గెలవడం అదే మొదటిసారి. ఇక, మహిళల క్రికెట్లో ఎన్నో ఏళ్లుగా పాకిస్థాన్‌పై తిరుగులేని ఆధిపత్యం చలాయిస్తున్న భారత జట్టు.. ఆసియా కప్‌లోనూ పైచేయి సాధించింది. శనివారం గ్రూప్‌ఎలో తన చివరి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన 7 వికెట్ల తేడాతో పాక్‌ను చిత్తు చేసింది.

## బ్రో.. ఒక్కసారి స్కోరుబోర్డు చూసుకో..

ఆసియా కప్‌లో భారత్ వరుసగా విజయాలతో దూసుకుపోతోంది. శనివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను భారత్ చిత్తుచిత్తుగా ఓడించింది. ఆ జట్టును 18.1 ఓవర్లలో 55 పరుగులకే ఆలౌట్ చేసి ఈ స్వల్ప లక్ష్యాన్ని 8.4 ఓవర్లలో ఛేదించింది. భారత్ చేతిలో ఘోర ఓటమి చవిచూసినా పాక్ పోకడ మాత్రం తగ్గడం లేదు. మ్యాచ్ ముగిసిన అనంతరం ఆ జట్టు కోచ్ వహాబ్ రియాజ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఆసియా కప్‌లో తమదే అత్యుత్తమైన టీమ్ అని వ్యాఖ్యానించాడు. 'ఈ ఆసియా కప్‌లో ట్రోఫీని గెలుచుకునే సత్తా పాకిస్థాన్‌కే ఉందని నేను ఇప్పటికీ నమ్ముతున్నాను. ఎందుకంటే ఇక్కడి పరిస్థితులు మాకు బాగా అనుకూలంగా ఉన్నాయి. భారత్‌తో మ్యాచ్‌లో చేసిన తప్పుల గురించి చర్చించుకుంటాం. ఆ తప్పులు మళ్లీ చేయకుండా ప్రయత్నిస్తాం" అని వహాబ్ రియాజ్ పేర్కొన్నాడు. పాక్ కోచ్ (Wahab Riaz) వ్యాఖ్యలపై నెటిజన్లు సెటైరికల్‌గా స్పందిస్తున్నారు. "అవును.. వాళ్లదే అత్యుత్తమ జట్టు. కానీ ట్రోఫీని సాధించడానికి వాళ్లకు మ్యాచ్‌లు గెలవాల్సిన అవసరం లేదు. ట్రోఫీని అందుకుని అక్కడి నుంచి పారిపోయేందుకు మోసిన్ నఖ్వీ (Mohsin Naqvi) లాంటి వాళ్లు ఉంటే చాలు" అని ఓ నెటిజన్ కామెంట్ చేశాడు.




"మీడియా ముందుకు వచ్చే ముందు వాళ్ల స్కోరు బోర్డు చూడటం మార్చిపోయాడేమో.. అందుకే ఇలా మాట్లాడుతున్నాడు" అని మరో యూజర్ రాసుకొచ్చాడు. 'వహాబ్ రియాజ్ మొదట సెలక్టర్.. ఆ తర్వాత సలహాదారు. ఇప్పుడు కోచ్. పాకిస్థాన్ క్రికెట్‌ను నాశనం చేసిన వారిలో ఇతను కూడా ఉన్నాడు. ఇలాంటి పదవులకు ఎలా అర్హత సాధిస్తారో నాకు అస్సలు అర్థం కావట్లేదు" అని ఓ పాక్ అభిమాని కామెంట్ పెట్టాడు. ఈ ఆసియా కప్‌లో ఎనిమిది జట్లు పోటీపడుతుండగా.. లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన భారత్ సెమీస్‌కు దూసుకెళ్లింది. పాకిస్థాన్ ఇప్పటివరకు రెండు లీగ్ మ్యాచ్‌ల్లో ఒకటే (థాయ్‌లాండ్‌పై) గెలిచింది. దాయాది జట్టు చివర మ్యాచ్ హాంకాంగ్‌తో ఆడనుంది. అందులో గెలిస్తే పాక్ సెమీస్‌కు చేరుతుంది.

## దులీప్ ట్రోఫీ ఫైనల్.. 'శత'క్కొట్టిన ఇషాన్ కిషన్

చెన్నై: చెపాక్ స్టేడియం వేదికగా ఈస్ట్ జోన్, సౌత్ జోన్ మధ్య ఆదివారం దులీప్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ (Duleep Trophy Final) ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఈస్ట్ జోన్ తొలి రోజు ఆట ముగిసేసరికి 4 వికెట్ల నష్టానికి 385 పరుగులు చేసింది. కెప్టెన్ ఇషాన్ కిషన్ (111*; 135 బంతుల్లో 14 ఫోర్లు, 1 సిక్స్) శతకంతో ఆకట్టుకున్నాడు. వన్‌డౌన్ బ్యాటర్ శిఖర్ మోహన్ (85; 120 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ చేసే ఛాన్స్ మిస్ చేసుకున్నాడు. ఆరో స్థానంలో



వచ్చిన కుమార్ కుశాగ్ర (63*; 75 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధ శతకం సాధించాడు. అంతకుముందు ఓపెనర్లు అభిమన్యు ఈశ్వరన్ (72; 86 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్), వైభవ్ సూర్యవంశీ (44; 37 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 100 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి శుభారంభం అందించారు. అభిమన్యు ఈశ్వరన్ రనౌట్ కాగా.. సౌత్ జోన్ బౌలర్లలో చామ మిలింద్ 2, త్రిపురాణ విజయ్ ఒక వికెట్ పడగొట్టారు.

## షమిలో ఆకలి తగ్గలేదు

చెన్నై: సీనియర్ ఫాస్ట్‌బౌలర్ మహ్మద్ షమి టీమ్ఇండియాకు దూరమై ఏడాదిన్నర కావస్తోంది. ఏ ఫార్మాట్లోనూ అతడిని భారత జట్టులోకి ఎంపిక చేయట్లేదు. అయినా 36 ఏళ్ల షమి ఆశలు కోల్పోకుండా దేశవాళీల్లో అన్ని ఫార్మాట్లలోనూ బరిలోకి దిగుతున్నాడు. నిలకడగా రాణిస్తూ మళ్లీ టీమ్ఇండియాలో చోటు సంపాదించాలని గట్టిగా ప్రయత్నిస్తున్నాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్లోనూ అతను ఈస్ట్ జోన్ తరపున బరిలోకి దిగుతున్న నేపథ్యంలో ఆ జట్టు కెప్టెన్ ఇషాన్ కిషన్.. ఈ దిగ్గజ ఆటగాడి తపనను కొనియాడాడు. "అతను భారత అత్యుత్తమ ఫాస్ట్‌బౌలర్లలో ఒకడు. తనది ఆటలో దిగ్గజ స్థాయి. బెంగాల్‌కు ఆడడం మొదలుపెట్టినప్పటి నుంచి స్థిరంగా రాణిస్తున్నాడు. టీమ్ఇండియా తరపునా అలాగే సత్తా చాటాడు. షమికి వయసు ఒక అంకె మాత్రమే. నిరంతరం కష్టపడుతూనే ఉంటాడు.

## సాత్విక్–చిరాగ్ జోడీకి చైనా మాస్టర్స్ టైటిల్

షెంజిన్: భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజు, చిరాగ్ శెట్టి చైనా మాస్టర్స్ సూపర్ సిరీస్ 750 టైటిల్‌ను దక్కించుకుంది. ఆదివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో ప్రపంచ నం.5 సాత్విక్, చిరాగ్ జంట 1121, 2113, 2117 తేడాతో హె జి టింగ్, రెన్ జియాంగ్ యు (చైనా) ద్వయాన్ని ఓడించి విజేతగా నిలిచింది. గంట 10 నిమిషాలపాటు సాగిన ఈ మ్యాచ్‌లో తొలి గేమ్‌లో భారత జోడీ నిరాశపర్చింది. తర్వాత పుంజుకున్న భారత ద్వయం రెండు గేమ్‌ల్లో దూకుడుగా ఆడి చైనా జోడీని మట్టికరిపించింది. ఈ టోర్నీలో 2023, 2025లో రన్నరప్‌గా నిలిచిన సాత్విక్, చిరాగ్ జంట మూడో ప్రయత్నంలో చైనా మాస్టర్స్ సూపర్ సిరీస్ 750 టైటిల్‌ను దక్కించుకుంది.





# మార్షల్ ఆర్ట్స్‌తో క్రమశిక్షణ

'మార్షల్ ఆర్ట్స్ అంటే ఎదుటివారిపై దాడి చేయడం కాదు.. మనల్ని మనం రక్షించుకోవడమే. కలరిపయట్టు, కరాటే నేర్చుకోవడం వల్ల జీవితంలో క్రమశిక్షణ, ఏకాగ్రత, సమతుల్యత అలవడ్డాయి' అని నటి అనంతిక పేర్కొంది. రోమాంచకం మూవీలో నటించింది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచే కళారూపాలపై ఆసక్తి ఉందని చెప్పారు. కూచిపూడి, భరతనాట్యం, కథకళితో పాటు కరాటే, కలరి పయట్టు నేర్చుకున్నట్లు తెలిపారు. ఉదయం నృత్యం, పాటలు నేర్చుకుని.. సాయంత్రం కరాటే సాధన చేసేదానినని చెప్పారు. ఈ కళలు తన వృత్తిగత, వ్యక్తిగత జీవితంలో ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పింది.





## సినిమా

## డ్రాగన్ మూవీలో స్పెషల్ సాంగ్.. ఇద్దరు భామలతో ఎన్టీఆర్ స్టెప్పులు!



ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమాపై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. వర్కింగ్ టైటిల్‌గా 'డ్రాగన్', 'బ్రూస్ లీ' పేర్లు వినిపిస్తున్న ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఓ క్రేజీ న్యూస్ చక్కర్లు కొడుతోంది. ఈ మూవీ కోసం ఓ స్పెషల్ సాంగ్‌ను భారీ స్థాయిలో చిత్రీకరించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం భారీ సెట్‌ను సిద్ధం చేస్తున్నారట. ఈ పాటలో ఎన్టీఆర్, రుక్మిణీ వసంత్‌తో పాటు మరో ఇద్దరు హీరోయిన్లు కూడా స్టెప్పులు వేయనున్నట్లు తెలుస్తోంది. పాటలో విజువల్స్ గ్రాండ్‌గా ఉండనున్నాయని టాక్. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఎన్టీఆర్ కెరీర్‌లోనే బెస్ట్ మూవీగా నిలిపేందుకు ప్రశాంత్ నీల్ కష్టపడుతున్నారట. స్క్రిప్ట్ కోసం ఆయన చాలా సమయం తీసుకోవడంతో సినిమాపై మరింత ఆసక్తి నెలకొంది. ఇక ఈ చిత్రంలో అనిల్ కపూర్ కీలక పాత్రలో కనిపించనున్నారు.

## శాండల్‌వుడ్‌లోకి మాళవిక శర్మ

మాళవిక శర్మకు ఈ ఓనం ప్రత్యేకంగా నిలిచింది. మలయాళ చిత్రసీమలోకి 'ఖలీఫా'తో అడుగుపెట్టిన ఆమెకు కేరళ ప్రేక్షకుల నుంచి ఊహించని ఆదరణ లభించింది. వైశాఖ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్‌కు జోడీగా ఫిజా పాత్రలో కనిపించింది. కొత్త భాష అయినప్పటికీ ప్రేక్షకుల స్పందన తనను ఆశ్చర్యపరిచిందని మాళవిక తెలిపింది. మలయాళంలో మరిన్ని సినిమాలు చేయాలనే ఆసక్తి ఈ అనుభవంతో పెరిగిందని చెప్పింది. భాష అర్థం కాని సందర్భాల్లో పృథ్వీరాజ్ ఎంతో సహకరించారని, దర్శకుడు వైశాఖ్ కూడా పాత్రను తీర్చిదిద్దడంలో మార్గనిర్దేశం చేశారని పేర్కొంది. తెలుగులో 'నేల టికెట్'తో సినీ ప్రయాణం ప్రారంభించిన మాళవిక.. తమిళంలోనూ నటించింది. ఇప్పుడు మరో కొత్త భాషలోకి అడుగు పెడుతోంది. గణేశ్ సరసన నటిస్తున్న 'బృందవిహారి'తో కన్నడ చిత్రసీమకు పరిచయం కానుంది. ఇందులో మీరా అనే కృష్ణభక్తురాలి పాత్రలో కనిపించనుంది. నటనకు ప్రాధాన్యం ఉన్న ఈ పాత్ర తనకు సవాలుగా అనిపించిందని మాళవిక చెప్పింది. భాషలు మారుతున్నా.. బలమైన పాత్రలు చేస్తూ మంచి నటిగా ఎదగాలన్నదే తన లక్ష్యమని ఆమె స్పష్టం చేసింది.

## ది ప్యారడైజ్ రిలీజ్‌పై క్లారిటీ



నాని హీరోగా దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా మూవీ 'ది ప్యారడైజ్'. ఇటీవల ఈ చిత్రం నుంచి విడుదలైన 'ఏషనాగుల' సాంగ్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. మిలియన్ల వ్యూస్‌తో ఈ పాట యూట్యూబ్‌లో దూసుకెళ్తోంది. ఈ నేపథ్యంలో నాని సినీ ప్రయాణం 18 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మేకర్స్ బిగ్ అప్‌డేట్ ఇచ్చారు. 'ది ప్యారడైజ్' రిలీజ్‌పై ఎలాంటి సందేహాలు అక్కర్లేదని స్పష్టం చేస్తూ.. ముందుగా ప్రకటించినట్లుగానే సెప్టెంబర్ 24న సినిమాను థియేటర్లలోకి తీసుకురానున్నట్లు ఓ వీడియో ద్వారా వెల్లడించారు. దీంతో రిలీజ్ విషయంలో నెలకొన్న సస్పెన్స్‌కు తెరపడింది. అయితే ఈ చిత్రాన్ని హిందీలో విడుదల చేసే ఆలోచన లేదనే ప్రచారం జరుగుతోంది. దీనిపై మేకర్స్ మాత్రం స్పందించలేదు. ఈ మూవీలో నానికి జోడీగా కయదు లోహర్ నటిస్తోంది.

## శిరీష ప్రేమలో పడతారు

- **అనస్వర రాజన్**

మీరందరూ శిరీష పాత్రతో ప్రేమలో పడతారని అని హీరోయిన్ అనస్వర రాజన్ పేర్కొంది. కుమారి 21ఎఫ్' ఫేమ్ పల్నాటి సూర్యప్రతాప్ 'అంతా రాములోరు చూసుకుంటారు' మూవీని తెరకెక్కిస్తున్నారు. గోదావరి ప్రాంతం నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో సంగీత్ శోభన్, అనస్వర జంటగా నటిస్తున్నారు. ఇద్దరు మారుతి–శిరీష పాత్రల్లో కనిపించనున్నారు. ఈ మూవీకి సంబంధించిన గ్లింప్స్‌ను చిత్రబృందం ఆదివారం లాంచ్ చేసింది. ఈ సందర్భంగా ఈవెంట్‌లో అనస్వర గోదావరి జిల్లాల్లో షూటింగ్ అనుభవాలను పంచుకున్నది. 'చాలా అందమైన ప్రదేశం. మంచి మనసున్న ప్రజలు.. అచ్చం ఒక చిన్న కేరళలా అనిపించింది. అక్కడ షూటింగ్ చాలా ఎంజాయ్ చేశాం. తపేశ్వరం కాజా కూడా చాలా నచ్చింది' అని చెప్పింది. ఇక ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్, వీజీబీ ఫిల్మ్స్ బ్యానర్స్‌పై ధీరజ్ మొగిలినేని, గిరి బాబు వల్లభనేని నిర్మిస్తున్న ఈ చిత్రానికి లక్ష్మీ భూపాల్ కథ అందించగా, మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తున్నారు. రావు రమేశ్, రోహిణి, రఘుబాబు, అలీ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.